

హెల్ప్‌లైన్ నంబర్లు
దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980
నల్లగొండ : 18004251442
యాదాద్రి : 1800 425 7106
సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు
గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.142	206	234
సూర్యాపేట	రూ.155	230	260
నల్లగొండ	రూ.149	216	246

ఉష్ణోగ్రత గరిష్ఠం 38.0 । కనిష్ఠం 24.0

అగ్గిరాజుకుంటే..

- తరుచూ అగ్ని ప్రమాదాలు
- నీటి కొరతతో ఇబ్బందులు
- అంచనాలకు మించి ఆస్తి నష్టం
- అగ్నిమాపక శాఖను వేధిస్తోన్న సిబ్బంది కొరత
- ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 14 ఫైర్‌స్టేషన్ల దీనస్థితి



సూర్యాపేటలోని అగ్నిమాపక కేంద్రం

అసలే వేసవి కాలం.. ఆపై మండుతున్న ఎండలు. ఇప్పటికే 46 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలతో ఏ సమయంలో ఏ అగ్ని ప్రమాదం జరుగుతుందోనన్న ఆందోళన నెల కొంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో అనేక పరిశ్రమలున్నాయి. వీటిలోనూ అనుకోని ప్రమాదాలు చోటు చేసుకొని అగ్ని ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి. అదే విధంగా గడ్డివాములు, పొలాల్లో వరికయ్యలకు నిప్పంటుకొని ఎకరాల కొద్దీ దగ్ధమవుతున్నాయి. ఇలాంటి సమయంలో బాధితులు ఫైర్‌స్టేషన్లను సంప్రదిస్తే అక్కడి నుంచి సేవలు అంతంత మాత్రంగానే లభిస్తుండడంతో ఊహించని నష్టం జరుగుతోంది. ఏళ్ల తరబడి అగ్నిమాపక శాఖను సిబ్బంది కొరత వేధిస్తుండడంతో ప్రమాదాల తీవ్రతను నియంత్రించలేకపోతున్నారు. వీటికితోడు ట్యాంకర్లలో నింపేందుకు నీటి వసతి లేక కూడా ప్రమాదాలు పెరుగుతూనే ఉన్నాయి. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 14 ఫైర్‌స్టేషన్లు వసతుల్లేక కొట్టుమిట్టాడుతున్నాయి. పరిస్థితులు ఇలానే ఉంటే ప్రస్తుత వేసవి గండం గడిచేదెలా? అంటూ జిల్లా ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

● 7లో..



రైలు ప్రమాదంలో దగ్ధమవుతున్న బోగీల మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది(ఫైల్)

ప్రచార హోరు

లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి రెండు రోజుల్లో తెరపడనుంది. ప్రచార సమయం తుదిదశకు చేరుతుండటంతో అభ్యర్థులు వేగం పెంచారు. ఎట్టి పరిస్థితుల్లోనూ విజయం సాధించాలన్న లక్ష్యంతో ప్రచారాన్ని ముమ్మరం చేస్తున్నారు. పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లోని పల్లెలు, పట్టణాలు పలు పార్టీలకు చెందిన అభ్యర్థుల ప్రచారంతో హోరెత్తాయి.

- (ఆంధ్రజ్యోతి-యాదాద్రి)



- తుదిదశకు చేరుతున్న ప్రచారం
- మరో రెండు రోజులూ హోరెత్తనున్న పల్లెలు, పట్టణాలు
- నేడు భువనగిరిలో అమిత్‌షా సభ
- యాదగిరిగుట్టలో కేటీఆర్ రోడ్‌షో

భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గాన్ని అన్నిపార్టీలూ ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. నెలరోజులుగా కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, సీపీఎం అభ్యర్థులు నిత్యం ప్రజల్లోనే ఉంటూ, ప్రజలతో మమేకమవుతూ ముమ్మరంగా ప్రచారాన్ని చేపడుతున్నారు. అయితే ఈస్థానాన్ని కైవసం చేసుకోవాలని ప్రధాన పార్టీలు కసరత్తు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ నియోజకవర్గంలో ఆయా పార్టీల అగ్రనేతలు స్వయంగా రంగంలోకి దిగుతున్నారు. పలు పార్టీల అగ్రనేతలు ఇప్పటికే జిల్లాలో పర్యటించి, రోడ్‌షోలు, కార్నర్ మీటింగ్‌ల్లో పాల్గొన్నారు. ఈ ఎన్నికల్లో ఎంపీ స్థానాన్ని కైవసం చేసుకునేందుకు పార్టీల అధిష్ఠానాలు కూడా అహర్నిశలు శ్రమిస్తున్నాయి. అభ్యర్థులు అగ్రనేతలతో ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా ఏ పట్టణానికి, పల్లెకు వెళ్లినా అభ్యర్థులకు అనుకూలంగా పలు పాటలతో ప్రచార రథాలే దర్శనమిస్తున్నాయి. ప్రధాన పార్టీల అభ్యర్థులు ఉదయం వేళల్లో ప్రజలను కలుస్తూ, సాయంత్రం వేళ బహిరంగసభలు నిర్వహిస్తున్నారు. అదేవిదంగా ఇంటింటి ప్రచారంతోపాటు, కులసంఘాలు, కాలనీ సంక్షేమ సంఘాలతో అభ్యర్థులు సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ప్రజలకు హామీల మీద హామీలు కురిపిస్తున్నారు. ఏ గ్రామంలో చూసినా విధులన్నీ పలు పార్టీలకు చెందిన అభ్యర్థుల కరపత్రాలు, వాల్‌పోస్టర్లు, భారీగా ఫ్లెక్సీలతో నిండిపోయాయి.ఆయా పార్టీలకు చెందిన ఎంపీలు, ఎమ్మెల్సీలు,మాజీమంత్రులు, మాజీఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధులంతా రంగంలోకి దిగి తమ అభ్యర్థులను గెలుపించుకునేందుకు సర్వం ఒడ్డుతున్నారు. నియోజకవర్గవ్యాప్తంగా పోలింగ్ సమీపిస్తుండటంతో అభ్యర్థుల్లో పోరు రసవత్తరంగా మారింది. దీంతో ప్రచారం రణ రంగాన్ని తలపిస్తోంది.

అగ్రనేతల ప్రచారం

ప్రచారానికి ఇంకా రెండు రోజులు మాత్రమే ఉండటంతో ఆయా పార్టీలకు చెందిన అగ్రనేతలు భువనగిరి నియోజకవర్గంలో పర్యటించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. భువనగిరిలో ఈ నెల 9న బీజేపీ అగ్రనేత అమిత్‌షా బహిరంగసభలో పాల్గొంటారు. ఉదయం 10నుంచి 12గంటల సమయంలో సభను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇటీవల చౌటుప్పల్ మండలంలో నిర్వహించిన బహిరంగ సభకు బీజేపీ అధినేత జేపీ నడ్డా హాజరయ్యారు. బీజేపీ అభ్యర్థులను బలపరచాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే జిల్లాలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతోపాటు పలువురు కాంగ్రెస్ సీనియర్‌నేతలు పర్యటించారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు తమ మద్దతు తెలిపాలని, రాష్ట్రంలోని రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని భువనగిరి వేదికగానే ముఖ్యమంత్రి ప్రకటించారు.చౌటుప్పల్‌లో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకగాంధీ, లేనిపక్షంలో రాహుల్‌గాంధీతో బహిరంగసభను ఏర్పాటుచేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. అయితే దేశవ్యాప్తంగా ఎన్నికలు జరుగుతుండటంవతో అగ్రనేతలు సమయం ఇచ్చిన పక్షంలో సభ నిర్వహించేందుకు అభ్యర్థులు సిద్ధం చేసుకుంటున్నారు. భువనగిరిలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఇప్పటికే పర్యటించారు. రోడ్‌షోలు నిర్వహించారు. గురువారం యాదగిరిగుట్టలో కేటీఆర్ రోడ్‌షోను నిర్వహించనున్నారు. సీపీఎం అభ్యర్థి బరిలో ఉండటంతో పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ.రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంతోపాటు పార్టీ రాష్ట్రకార్యవర్గ సభ్యులంతా కూడా నియోజకవర్గంలో ప్రచారంలో పాల్గొంటున్నారు.

భువనగిరిలో శ్రమిస్తున్న అభ్యర్థులు



భువనగిరిలో ప్రధాన పార్టీల అభ్యర్థులంతా గెలుపుకోసం తీవ్రంగా శ్రమిస్తున్నారు. అసెంబ్లీ నియోజకవర్గాల్లో పర్యటిస్తూ పోటాపోటీగా ప్రచారం నిర్వహిస్తున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, బీజేపీ అభ్యర్థి డాక్టర్ బూర నర్సయ్యగౌడ్, బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేష్, సీపీఎం అభ్యర్థి ఎండీ జహంగీర్‌తోపాటు స్వతంత్ర అభ్యర్థులు ముమ్మరంగా ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. నియోజకవర్గంలో అనూహ్య రీతిలో రాజకీయ సమీకరణలు మారుతున్నాయి. దీంతో అభ్యర్థులు ఎన్నికల్లో గెలుపొందేందుకు శాయశక్తులా ఒడ్డుతున్నారు. పలు పార్టీల్లో అసంతృప్తులు ఉండటంతో తలనొప్పిగా మారింది. దీంతో అభ్యర్థుల గుండెల్లో గుబులు ప్రారంభమైంది. వారిని అధిష్ఠానం పెద్దలతో బుజ్జగించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. నియోజకవర్గంలోని సీనియర్ నేతలను కలుస్తూ, ప్రజల మద్దతుకోసం తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. తాజాగా నియోజకవర్గాల్లో పట్టున్న నాయకులపై దృష్టి కేంద్రీకరించారు. దీంతోపాటు నియోజకవర్గంలో తనతో కలిసొచ్చే నాయకులందర్నీ కలుసుకుంటూ ప్రచారాన్ని ముమ్మరం చేస్తున్నారు. ఎమ్మెల్యేలు, తాజా మాజీ ఎమ్మెల్యేలతో కలిసి అన్ని నియోజకవర్గాల్లోనూ గెలుపే లక్ష్యంగా ప్రచారాన్ని చేపడుతున్నారు.

రూ.1.36 కోట్లు

ట్రాన్స్‌కోకు నష్టం



గుండాల మండలంలో నేలకొరిగిన విద్యుత్ స్తంభం

- ఉమ్మడి జిల్లాలో ఈదురు గాలుల బీభత్సం
- నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు
- సబ్‌స్టేషన్ల పరిధిలో దెబ్బతిన్న ఫీడర్లు
- గ్రామీణ ప్రాంతాల్లో కొనసాగుతున్న మరమ్మతు పనులు

మూడు రోజులుగా కురుస్తున్న వడగళ్ల వానలతో ట్రాన్స్‌కో సిబ్బందికి కంటిమీద కునుకు లేకుండా పోతోంది. కొంచెం బలంగా గాలి వీచినా, పిడుగు పడినా విద్యుత్ స్తంభాలు కూలిపోవడం, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవడం పరిపాటిగా మారింది. అయితే ఈదురుగాలులకు పెద్ద పెద్ద స్తంభాలు విరిగిపోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. నేలకూలిన స్తంభాల స్థానంలో కొత్తవి అమర్చి, మరమ్మతుకు వచ్చిన ట్రాన్స్‌ఫార్మలను బాగు చేసే పనిలో ట్రాన్స్‌కో సిబ్బంది నిమగ్నమయ్యారు. మూడు రోజులుగా గ్రామీణ ప్రాంతాల్లో మరమ్మతులు పనులు కొనసాగుతూనే ఉన్నాయి. మొత్తం మీద ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఈదురుగాలులతో ట్రాన్స్‌కోకు రూ.1.36 కోట్ల నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా అంచనా వేశారు. ఇందులో యాదాద్రి భువనగిరి జిల్లాలో రూ.21లక్షలు, సూర్యాపేట జిల్లాలో రూ.80లోలు, నల్లగొండ జిల్లాలో రూ.30లక్షల నష్టం వాటిల్లినట్లు అధికారులు పేర్కొంటున్నారు.

మూడు రోజులుగా మరమ్మతులు

మూడు రోజుల నుంచి విద్యుత్ సిబ్బంది తీరిక లేకుండా ఉన్నారు. రాత్రింబవళ్లు గ్రామాల్లో, విద్యుత్ సబ్‌స్టేషన్లలోనే ఉంటున్నారు. మరమ్మతులకు వచ్చిన వాటిని సరిచేసి ఎప్పటికప్పుడు విద్యుత్ సరఫరాను చేస్తున్నాం. ప్రత్యేకంగా అధికారులను నియమించి ఈదురు గాలుల పనులను పర్యవేక్షణ చేయిస్తున్నాం. ఇంకా నాలుగురోజుల పాటు వర్షాలు వచ్చే అవకాశం ఉన్నందున సిబ్బందిని సిద్ధంగా ఉంచాం. జిల్లాలో రూ.80 లక్షల నష్టం వాటిల్లింది.

- పాల్‌రాజ్, ఎస్ఈ, సూర్యాపేట

నల్లగొండ టౌన్: గడిచిన మూడు రోజులుగా జిల్లాలో కురిసిన వర్షాలు, ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. దీంతో విద్యుత్ శాఖకు రూ.30లక్షల నష్టం వాటిల్లింది. జిల్లాలో పలుచోట్ల ఈదురు గాలులకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. నల్లగొండ పట్టణంతోపాటు కనగల్, తిప్పర్తి, శాలిగౌరారం, మునుగోడు, త్రిపురారం తదితర మండలాల్లో ఈదురుగాలులు సృష్టించిన బీభత్సానికి అనేక చోట్ల స్తంభాలు నేలకొరిగాయి. పలు చోట్ల ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసమయ్యాయి. విద్యుత్ శాఖ అధికారుల అంచనాల ప్రకారం జిల్లాలో 90 విద్యుత్ స్తంభాలు నేలమట్టం కాగా విద్యుత్ లేన్లు తెగిపడ్డాయి. మరో ఐదు చోట్ల ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసమై ఆయా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం తలెత్తింది. ఈదురు గాలులతో రూ.30లక్షల మేరకు నష్టం వాటిల్లినట్లు అధికారులు గుర్తించారు. ఈ మేరకు విద్యుత్ మరమ్మత్తులను వెంటనే చేపట్టి సరఫరాను పునరుద్ధరించినట్లు ఎస్ఈ చంద్రమోహన్ తెలిపారు.

ట్రాన్స్‌కోకు రూ.21లక్షల ఆస్తి నష్టం

భువనగిరి టౌన్: ఇటీవల కురిసిన వరుస వర్షాలతో యాదాద్రి భువనగిరి జిల్లాలో పలు స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు నేలకూలాయి. దీంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలుగడంతో పాటు ట్రాన్స్‌కోకు భారీ ఆస్తినష్టం సంభవించింది. అయితే ధ్వంసమైన స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో కొత్తవి అమర్చుతూ విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తున్నారు. ఈ నెల 5న జిల్లాలోని పలు ప్రాంతాల్లో కురిసిన వర్షాలు, వీచిన గాలులతో 11కేవీ స్తంభాలు 55, ఎల్‌టీ స్తంభాలు 108, ఎనిమిది ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసమయ్యాయి. అలాగే 7వ తేదీన కురిసిన భారీ వర్షాలతో 11కేవీ స్తంభాలు 18, ఎల్‌టీ స్తంభాలు 39, రెండు ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసమయ్యాయి. దీంతో జిల్లా ట్రాన్స్‌కోకు రూ.21.70లక్షల ఆస్తినష్టం జరిగింది. ఆస్తినష్టంతో నిమిత్తం లేకుండా విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తూ వినియోగదారులకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరాను చేస్తున్నామని ట్రాన్స్‌కో ఎస్ఈ ఐ శ్రీనాథ్ తెలిపారు.

భానుపురి: సూర్యాపేట జిల్లాలో ఈదురు గాలులకు, వర్షాలతో విద్యుత్ శాఖకు భారీ నష్టం వాటిల్లింది. రెండ్రోజుల క్రితం వీచిన ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులు, పిడుగుపాటుకు విద్యుత్ సబ్‌స్టేషన్లు సైతం పని చేయని పరిస్థితి ఏర్పడింది. వీటి మరమ్మతు పనుల్లో సిబ్బంది తలమునకలయ్యారు. విద్యుత్ శాఖకు సుమారు రూ.80లక్షల నష్టం వాట్లిందని అధికారులు పేర్కొంటున్నారు. ఎల్టీ స్తంభాలు 192 ధ్వంసం కాగా ఇప్పటి వరకు 86 స్తంభాలను వాటి స్థానాల్లో అమర్చారు. మిగిలిన స్తంభాలను అమర్చే పనుల్లో సిబ్బంది నిమగ్నమయ్యారు. 11 కేవీ విద్యుత్ స్తంభాలు 124 కూలిపోగా 60 స్తంభాలను అమర్చారు. మిగతా 64 స్తంభాలను అమర్చే పనుల్లో సిబ్బంది ఉన్నారు. జిల్లాలో అకాల వర్షం, పిడుగుపాటుకు మూడు ఉపకేంద్రాలు తప్ప ఏవీ కూడా పని చేయలేదని, సిబ్బంది పనుల్లో నిమగ్నమై మరమ్మతు పనులను పూర్తి చేసి విద్యుత్తుకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నారని ట్రాన్స్‌కో అధికారులు పేర్కొన్నారు. సూర్యాపేట జిల్లాలో మునగాల, రామాపురం, ఆత్మకూర్(ఎస్), నూతనకల్, మద్దిరాల, చివ్వెంల, సూర్యాపేట, పెన్‌పహాడ్, హుజూర్‌నగర్ డివిజన్‌లలో అక్కడక్కడ నష్టం జరిగింది. ఆత్మకూర్, నూతనకల్, మద్దిరాలలో 38 స్తంభాలు కూలిపోగా, ఫీడర్లు సైతం ధ్వంసమయ్యాయి. మారుమూల గ్రామాల్లో మరమ్మతు పనులు కొనసాగుతూనే ఉన్నాయి. జిల్లాలో పనులను పర్యవేక్షణ చేయడానికి ముగ్గురు ప్రత్యేక అధికారులను నియమించినట్లు ఉన్నతాధికారులు పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా 14ఫీడర్లకు 13 ఫీడర్లు పిడుగుపాటుకు గురై మరమ్మతులకు వచ్చాయి. మునగాల మండలంలో నాలుగు ఫీడర్లు ధ్వంసమయ్యాయి.

ఎస్ఎల్‌బీసీని పూర్తి చేస్తాం

కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి



ప్రచార సభలో మాట్లాడుతున్న కుందూరు జానారెడ్డి, పక్కన ఎంపీ అభ్యర్థి రఘువీర్‌రెడ్డి

పెద్దవూర, మే 8: కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డిని గెలిపిస్తే ఎస్ఎల్‌బీసీ పూర్తి చేసి, సాగు, తాగునీటి కష్టాలు తీర్చుతామని కాంగ్రెస్ సీనియర్‌నేత, మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి అన్నారు. బుధవారం నల్లగొండ జిల్లా పెద్దవూరలో జరిగిన ప్రచార సభలో ఆయన మాట్లాడారు. నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థిగా వామపక్షాలు బలపరిచిన కాంగ్రెస్ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డిని గెలిపించాలన్నారు. బీజేపీ, బీఆర్ఎస్‌లు ఇచ్చిన హామీలను గాలికి వదిలేసి పరిపాలన చేశాయని, అభివృద్ధిని పట్టించుకోలేదన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే ప్రజల మధ్య కుల, మత సామరస్యం నెలకొంటుందన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి రఘువీర్‌రెడ్డి మాట్లాడుతూ గిరిజన, మైనార్టీలకు రిజర్వేషన్లు పెంచుతామని చెప్పి అమలులో విఫలమైన బీఆర్ఎస్ పార్టీని ఓడించాలన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన కొద్ది కాలంలోనే ఐదు హామీలను అమలు చేసిందని, రైతులకు రుణమాఫీని ఆగస్టు 15లోపు పూర్తి చేస్తామన్నారు. ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి మాట్లాడుతూ గత కేసీఆర్ ప్రభుత్వం ఖజానాను ఖాళీ చేసిందన్నారు. బీజేపీ నాయకులు నోటిని అదుపులో పెట్టుకొని మాట్లాడాలన్నారు. కారుణ్య నియామకంలో మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ ఎన్నికయ్యారని, భవిష్యత్‌లో వార్డు మెంబర్‌గా కూడా గెలవలేరని విమర్శించారు. కులాలను అడ్డుపెట్టుకొని రాజకీయం చేయడం తగదన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్ నాయక్, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, తుమ్మలపల్లి శేఖర్‌రెడ్డి, సీపీఎం నాయకులు కున్‌రెడ్డి నాగిరెడ్డి, గడ్డంపల్లి రవీందర్‌రెడ్డి, రమణరెడ్డి, డీవీఎన్ రెడ్డి, మాజీ ఎంపీపీ శంకర్‌నాయక్, పార్టీ మండల అధ్యక్షుడు యాదగిరిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతు తెలిపిన టీడీపీ నాయకులు

మిర్యాలగూడ టౌన్: కాంగ్రెస్ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డికి టీడీపీ నాయకులు మద్దతు తెలిపారు. ప్రచారంలో భాగంగా నియోజకవర్గంలో పర్యటించిన రఘువీర్‌ను టీడీపీ సీనియర్ నాయకులు జెడ రాములుయాదవ్, కాసుల సత్యం తదితరులు కలిసి మద్దతు తెలిపారు.

ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలి

- సెలవు రోజు అని ఓటేయకుండా ఉండొద్దు
- కలెక్టర్ ఎస్.వెంకట్రావ్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్. వెంకట్రావ్

సూర్యాపేట(కలెక్టరేట్), మే 8: రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ అన్నారు. బుధవారం జిల్లాకేంద్రంలోని ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల నుంచి కలెక్టరేట్ వరకు లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో చేపట్టిన స్వీప్ కార్యక్రమంలో భాగంగా ఎన్నికల అవగాహన బైక్ ర్యాలీని ఎస్పీ రాహుల్‌హెగ్డేతో కలిసి జెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు. ఓటు మన జన్మ హక్కు అని, ముఖ్యంగా ఓటు హక్కు ఉన్న యువత తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. చుట్టుపక్కల ఉన్న వారికి ఓటు హక్కుపై అవగాహన కల్పించాల్సి బాధ్యత యువతపై ఉందన్నారు. ఓటర్లను చైతన్యపరిచేందుకు అవగాహన ర్యాలీలు నేడు కోదాడ, ఈ నెల 10వ తేదీన హుజూర్‌నగర్, 11వ తేదీన తుంగతుర్తి నియోజకవర్గాల్లో బైక్ ర్యాలీ కొనసాగుతుందన్నారు. ఎస్పీ రాహుల్‌హెగ్డే మాట్లాడుతూ ఓటర్లు, ఎన్నికల సామగ్రికి పకడ్బందీ రక్షణ కల్పిస్తున్నామని తెలిపారు. సెలవు రోజు అని ఓటు వేయకుండా అశ్రద్ధ వహించవద్దన్నారు. అనంతరం కలెక్టరేట్‌లో ఎన్నికల నేపథ్యంలో బైక్ ర్యాలీలో పాల్గొన్న అన్ని శాఖల సిబ్బందిని అభినందించారు. మొదటిస్థానంలో వచ్చిన విద్యాశాఖకు, రెండోస్థానంలో వచ్చిన డీఆర్‌డీఏ, మూడవస్థానం వచ్చిన మునిసిపల్ మెప్మా శాఖలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్వీప్ నోడల్ అధికారి అశోక్, జడ్పీసీఈవో అప్పారావు, డీఆర్‌డీవో వీడీ మధుసూదన్‌రాజు, డీఏఓ సతీష్‌కుమార్, ఏఎస్పీ నాగేశ్వర్‌రావు, ట్రెయినీ ఐపీఎస్ రాజేష్ మీనా, సీపీవో ఎల్.కిషన్, ఆర్‌డీవో వేణుమాదవ్, తసీహల్దార్ శ్యాంసుందర్‌రెడ్డి, డీఎంహెచ్‌వో కోటాచలం, డీఎస్‌వో మోహన్‌బాబు, ఉద్యోగులు సిబ్బంది పాల్గొన్నారు.

ఫెసిలిటేషన్ కేంద్రాల గడువు పెంపు

ఫెసిలిటేషన్ కేంద్రాల గడువు మరో రెండు రోజులు పొడిగించినట్లు కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ బుధవారం తెలిపారు. ఎన్నికల నిర్వహణలో పాల్గొనే వారికి ఆయా నియోజకవర్గాల పరిధిలో ఫెసిలిటేషన్ కేంద్రాలు ఈ నెల 3వ తేదీ నుంచి 8వ తేదీ వరకు కొనసాగాయని, ఆ కేంద్రాలనుమరో రెండు రోజులు ఈ నెల 9వ తేదీ, 10వ తేదీ వరకు పొడిగించినట్లు తెలిపారు. ఎన్నికల విధులు కేటాయించిన ఉద్యోగులు, సిబ్బంది పోలీస్ అధికారులు పోస్టల్ బ్యాలెట్ సద్వినియోగం చేసుకోవాలన్నారు.



బైక్‌ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ వెంకట్రావ్, ఎస్పీ రాహుల్‌హెగ్డే

పదేళ్ల అనంతరం తండ్రి చెంతకు

- నాలుగేళ్ల ప్రాయంలో విజయవాడలో కిడ్నాప్
- ఆలేరులో పోలీసులకు చిక్కిన కిడ్నాప్ ముఠా
- అనాథాశ్రమంలో పెరిగిన బాలుడు

తండ్రి చెంతకు చేరిన ప్రణయ్

భువనగిరి టౌన్, మే 8: నాలుగేళ్ల ప్రాయంలో కిడ్నాపై పదేళ్లుగా అనాథ బాలల వసతి గృహంలో ఉంటున్న బాలుడిని ఓ స్వచ్ఛంద సంస్థ కుటుంబం చెంతకు చేర్చింది. వివరాల్లోకి వెళ్తే... 21 జూన్ 2014లో ఆలేరు శివారులోని మంతపురి రోడ్డులో బూడిగ జంగాల కాలనీలో గాడిద పాలు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్న ఓ సంచార కుటుంబానికి చెందిన ఇద్దరు బాలురులను కిడ్నాప్ చేసేందుకు ఓ ముఠా ప్రయత్నించింది. అప్రమత్తమైన స్థానికులు ఆ ముఠాను పట్టుకొని దేహ శుద్ధి చేసి అదే రోజు ఆలేరు పోలీసులకు అప్పగించారు. పోలీసుల దర్యాప్తులో స్థానికులు పట్టుకున్నది 11 మందితో కూడిన కిడ్నాప్ ముఠాగా, రాష్ట్ర వ్యాప్తంగా ఏడుగురు బాలలను కిడ్నాప్ చేసినట్లు తేలింది. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు అప్పటికే ఆ ముఠా విక్రయించిన ఐదుగురు పిల్లలను పోలీసులు స్వాధీనం చేసుకొని తల్లిదండులకు అపగించారు. కానీ మరో ఇద్దరు పిల్లలను విక్రయించే క్రమంలోనే ఆ కిడ్నాప్ ముఠా పట్టుబడింది. ఈ క్రమంలో ఆ పిల్లలిద్దరిని పోలీసులు స్వాధీనం చేసుకొని అప్పటి ఉమ్మడి జిల్లా కేంద్రం నల్లగొండలోని శిశు గృహకు తరలించారు. అనంతరం జిల్లాల పునర్విభజనతో ఆ ఇద్దరు పిల్లలను యాదాద్రి భువనగిరి జిల్లా బాలల పరిరక్షణ విభాగానికి అప్పగించడంతో ఆ ఇద్దరిని ఆలేరు మండలం మంతపురిలో ఓ స్వచ్ఛంద సంస్థ నడుపుతున్న బ్యాక్ టూ బ్యాక్ సంరక్షణ కేంద్రంలో చేర్చారు. ఆ ఇద్దరు పిల్లలకు ప్రణయ్, సాత్విక్‌గా నామకరణం చేయగా అక్కడే ఉంటూ ప్రస్తుతం 8వ తరగతి చదువుతున్నారు. అయితే ఆ ఇద్దరు పిల్లల స్వస్థలాలను ఛేదించలేక ఆలేరు పోలీసులు 2019లో అన్‌ట్రేసబుల్ కేసుగా పేర్కొంటూ బాలల పరిరక్షణ విభాగానికి అప్పగించారు. అయితే బ్యాక్ టూ బ్యాక్ శరణాలయం డైరెక్టర్ అభిలాష కర్నాటి, మేనేజర్ బూర్ల సంపత్ ఆ ఇద్దరి పిల్లల కుటుంబాల ఆచూకీని ఎలాగైనా గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించాలని చేసిన ప్రయత్నాలకు ప్రణయ్ తన చిన్ననాటి జ్ఞానపాలను నెమరువేసుకుంటూ తమది చింతపల్లి గ్రామమని, తండ్రిపేరు సుబ్బయ్యగా పేర్కొనడంతో ఇంటర్‌నెట్‌లో ఆ పేరుగల గ్రామాలను వెతికి ప్రణయ్ అక్కడికి తీసుకెళ్లగా తమ గ్రామం కాదని చెప్పేవాడు. ఈ క్రమంలో డ్రాయింగ్ థెరపీతో జ్ఞాపకాలను గుర్తు చేసుకునేలా చేసిన ప్రయత్నాలతో ప్రణయ్ మా నాన్న వీధులలో చెత్తను సేకరిస్తాడని, పొడవాటి రిక్షా ఉండేదని తరచుగా సముద్రం ఒడ్డుకు తీసుకెళ్లేవాడని పేర్కొంటూ బొమ్మలు గీసి చూపించాడు. ఆ ఆధారాలతో మరో మారు ఇంటర్‌నెట్‌లో వెతుకగా తూర్పుగోదావరి జిల్లా మోరె మండలం చింతలమోరె గ్రామంగా భావిస్తూ ప్రణయ్‌ను 24 జూలై 2023న అక్కడికి తీసుకువెళ్లగా జ్ఞాపకాలతో నేరుగా ఇంటికి వెళ్లారు. అయితే అప్పటికే ప్రణయ్ తల్లి లక్ష్మి మృతి చెందడంతో తండ్రి మరో వివాహం చేసుకున్నాడు. అయితే ప్రణయ్ వెంటనే తండ్రిని గుర్తించగా అతను మాత్రం కాస్త ఆలస్యంగా గుర్తించి, అక్కున చేర్చుకున్నాడు. ఈ మేరకు బ్యాక్ టూ బ్యాక్ హోం ప్రతినిధులు ప్రణయ్ తప్పిపోయిన ఘటనపై తండ్రిని ఆరా తీయగా విస్తుపోయే విషయం చెప్పాడు. 2014లో కనకదుర్గ దేవి దర్శనం కోసం కుటుంబ సభ్యులందరూ కలిసి విజయవాడకు వెళ్లారు. అక్కడ మెట్ల మీద కూర్చోమన్న ప్రణయ్ తప్పిపోగా పరిసరాల్లో వెతికినప్పటికీ కనిపించలేదు. కానీ తప్పిపోయిన ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయాలనే అవగాహన లేకపోవడంతో స్వగ్రామానికి వెళ్లి కాల క్రమంలో మరిచిపోయినట్లు పేర్కొన్నారు. కాగా డాక్యుమెంట్లు, అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరమే ప్రణయ్‌ను తండ్రికి అప్పగిస్తామని సీడబ్ల్యూసీ చైర్మన్ బండారు జయశ్రీ, జిల్లా బాలల పరిరక్షణ అధికారి పి.సైదులు తెలిపారు. కేసును రీ ఓపెన్ చేయాలని ఆలేరు పోలీసులను కోరనున్నట్లు పేర్కొన్నారు.

కూరెళ్ల విఠలాచార్యకు నేడు పద్మశ్రీ ప్రదానం

రామన్నపేట, మే 8: సొంత ఇంటినే గ్రంథాలయంగా మార్చి రెండు లక్షలకు పైగా పుస్తకాలు సమకూర్చి సమాజానికి అంకితం చేసిన మధుర కవి కూరెళ్ల విఠలాచార్య డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య పద్మశ్రీ అవార్డు అందుకోనున్నారు. ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో గురువారం జరిగే కార్యక్రమంలో ఆయనకు రాష్ట్రపతి ద్రౌపదీముర్ము పురస్కారాన్ని అందజేయనున్నారు. రాష్ట్రపతి భవన్ ఆహ్వానం మేరకు ఆయన బుధవారం ఢిల్లీ బయలుదేరివెళ్లారు. సాహిత్య ప్రజాసేవ అందిస్తున్న విఠలాచార్యను 'మన్‌కీ బాత్' కార్యక్రమంలో 2021 సంవత్సరంలో ప్రధాని నరేంద్రమోదీ ప్రత్యేకంగా ప్రశంసించారు. ఇటీవల దాశరథి పురస్కారంతో తెలంగాణ ప్రభుత్వం విఠలాచార్యను గౌరవించింది. ఈ ఏడాది జనవరిలో కేంద్ర ప్రభుత్వం ఆయనకు పద్మశ్రీ అవార్డు ప్రకటించింది.

లక్ష్మీనృసింహుడికి నిత్యారాధన పర్వాలు

యాదగిరిగుట్ట, రూరల్, మే 8: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దివ్యక్షేత్రంలో బుధవారం నిత్యారాధన పర్వాలు ఆగమ శాస్త్రరీతిలో వైభవంగా కొనసాగాయి. విశ్వక్సేనుడికి తొలి పూజలతో కల్యాణ తంతు కొనసాగింది. కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులకు అర్చకులు స్వామివారి ప్రసాదాలను అందజేసి ఆశీర్వచనం జరిపారు. రామలింగేశ్వరుడికి నిత్య పూజలు, యాగశాలలో నిత్య రుద్రహవనం స్మార్త సంప్రదాయరీతిలో నిర్వహించారు. ఆలయ ఖజానకు వివిధ విభాగాల ద్వారా రూ.13, 82,158 ఆదాయం సమకూరినట్టు దేవస్థాన ఈవో ఎ. భాస్కర్‌రావు తెలిపారు.

చెర్వుగట్టులో ఘనంగా లక్ష పుష్పార్చన

చెర్వుగట్టులో లక్ష పుష్పార్చనను నిర్వహిస్తున్న పురోహితులు

నార్కట్‌పల్లి, మే 8: ప్రసిద్ధ శైవ క్షేత్రమైన నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టులో కొలువైన పార్వతీ జడల రామలింగేశ్వరస్వామికి అమావాస్య తిథిని పురస్కరించుకుని మంగళవారం రాత్రి లక్ష పుష్పార్చన ఉత్స వం ఘనంగా నిర్వహించారు. తొలుత పార్వతీపరమేశ్వరుల ఉత్సవమూర్తులను గర్భాలయం నుంచి మహామంటపం వరకు అర్చకుల వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ పల్లకి సేవతో మహామంటపానికి చేర్చారు. అనంతరం ప్రధానార్చకుడు ప్రధానార్చకుడు పోతులపాటి రామలింగేశ్వరశర్మ, శిశ్య అర్చకస్వాములు లక్ష పుష్పార్చన ఉత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించారు. ఉత్సవమూర్తుల పూజలందుకున్న పూలను తీసుకునేందుకు భక్తులు పోటీ పడ్డారు. అమావాస్య తిథి బకావడంతో భక్తులు ఆలయానికి అధిక సంఖ్యలో చేరుకున్నారు. కోనేరులో పుణ్యస్నానమాచరించి, స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ వేడుకల్లో ఈవో నవీన్, దేవస్థాన సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

'పదేళ్ల కేంద్ర పాలనలో ప్రజా జీవితం- దేశ భవిష్యత్తు' పై సదస్సు

మిర్యాలగూడ: 'పదేళ్ల కేంద్ర పాలనలో ప్రజా జీవితం- దేశ భవిష్యత్తు' అనే అంశంపై గురువారం సదస్సు నిర్వహించనున్న ట్లు సామాజిక వేత్త డాక్టర్ జాడి రాజు, ప్రజాసంఘాల జేఏసీ క న్వీనర్ బీసం రామయ్య తెలిపారు. టీపీజేఏసీ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలోని రామచంద్రాపురం ఐఎంఏ హాల్‌లో ఉదయం 10గంటలకు సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సదస్సుకు వక్తలుగా రాజకీయ విశ్లేషకులు పరకాల ప్రభాకర్, టీ పీజేఏసీ నాయకలు రవిచందర్‌లు హాజరవుతారని అన్నారు. విద్యావంతులు, ప్రజా సంఘాల నేతలు, మహిళలు, అన్ని వర్గాల ప్రజలు హాజరై సదస్సును జయప్రదం చేయాలని కోరారు.

ఎమ్మెల్సీ స్థానానికి 19 నామినేషన్లు

నల్లగొండ, మే 8: వరంగల్ - ఖమ్మం - నల్లగొండ పట్టభద్రుల శాసన మండలి ఉప ఎన్నికకు నామినేషన్ల ప్రక్రియలో భాగంగా బుధవారం 19 మంది అభ్యర్థులు రిటర్నింగ్ అధికారి, నల్లగొండ జిల్లా కలెక్టర్ దాసరి హరి చందనకు నామినేషన్లు అందజేశారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి ఏనుగుల రాకేష్, బీజేపీ నుంచి కేదారి మేకల, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న తరపున ఆయన ప్రతిపాదకుడు మరో సెట్ అందించారు. ధర్మసమాజ్ పార్టీ నుంచి బరిగల దుర్గాప్రసాద్, విద్యార్థుల రాజకీయ పార్టీ నుంచి పాలకూరి అశోక్‌కుమార్, గోండ్వానా దండ కారుణ్య పార్టీ నుంచి సోడె వెంకటేశ్వర్లు, రిపబ్లికన్ పార్టీ నుంచి గుండాల జ్యోతి, సోషల్ జస్టిస్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి చెన్న శ్రీకాంత్ నామినేషన్ వేశారు. స్వతంత్ర అభ్యర్థులుగా పోతుల ప్రార్థన, గంగిరెడ్డి కోటిరెడ్డి, తేజావత్ వాసుదేవ్, పట్టెం మల్లిఖార్జున్, జన్ను భరత్, రత్నం ప్రవీణ్, భైరవభోట్ల శ్రీనివాసరావు, గుగులోతు సంతోష్, యాతాకుల శేఖర్, దునుకు వేలాద్రి, గుగులోతు రాజునాయక్ నామినేషన్లు వేశారు. బుధవారం అమావాస్య అయినప్పటికీ ఎలాంటి సెంటిమెంట్ లేకుండా అభ్యర్థులు అధిక సంఖ్యలో నామినేషన్లు దాఖలు చేయడం విశేషం.

బీజేపీ అభ్యర్థిగా ప్రేమేందర్‌రెడ్డి... నేడు నామినేషన్

బీజేపీ తరపున గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసిన గుజ్జుల ప్రేమేందర్ రెడ్డిని ఆ పార్టీ అధిష్ఠానం తమ అభ్యర్థిగా ప్రకటించింది. ఆయన గురువారం తన నామినేషన్ దాఖలు చేయనున్నారు.

కుటుంబ సమస్యలతో వ్యక్తి ఆత్మహత్య

బొమ్మలరామారం, మే 2: ఇటుక బట్టీల వద్ద పనిచేస్తున్న వ్యక్తి కుటుంబ సమస్యలతో ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఒరిస్సా రాష్ట్రానికి చెందిన సోమ్‌నాథ్ కండ్ (28) అనే వ్యక్తి మండలంలోని లక్ష్మీతండాలోని ఇటుక బట్టీల వద్ద కొంత కాలంగా పనిచేస్తున్నాడు. కుటుంబ సమస్యలతో మంగళవారం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కాగా బుధవారం భార్య జానకి కండ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఎస్ఐ తెలిపారు.

అగ్గి రాజుకుంటే..

- అగ్నిమాపక శాఖకు సిబ్బంది కొరత
- అంతటా ఫైర్ ఇంజన్‌లకు నీటి కొరత
- ఏటేటా పెరుగుతున్న ఆస్తి నష్టం
- ఉమ్మడి జిల్లాలో 14 ఫైర్ స్టేషన్లు

మంటలు అదుపు చేయాల్సిన అగ్నిమాపక కేంద్రాలు సమస్యల్లో కొట్టుమిట్టాడుతున్నాయి. సుశిక్షితులైన సిబ్బంది కొరతకు తోడు నీటి సమస్య కూడా ఉంది. మరి కొన్నిచోట్ల కాలం చెల్లిన వాహనాలు సైతం సహనానికి పరీక్ష పెడుతున్నాయి. భారీ అగ్నిప్రమాదాలు జరిగితే వీలైనంతా త్వరగా సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకోలేక పోతు న్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మొత్తం 14 ఫైర్‌స్టేషన్లలో సగానికి పైగా నీటి సమస్య ఉంది. దాదాపు అన్ని స్టేషన్లలో అగ్నిమాపక వాహనాలు కొనుగోలు చేసి దాదాపు పదేళ్లు దాటింది. వీటిలో కొన్ని వాహనాలు మరమ్మతులతో తరుచూ మొరాయిస్తున్నాయి.

దేవరకొండ నియోజకవర్గంలో



దేవరకొండ : దేవరకొండ అగ్నిమాపక కేంద్రం పరిధిలో 2022 నుంచి 2023వరకు 80అగ్ని ప్రమాదాలు జరిగాయి. దేవరకొండ అగ్నిమాపక కేంద్రం పరిధిలో దేవరకొండ, చందంపేట, డిండి, నేరేడుగొమ్ము, చింతపల్లి, నాంపల్లి, మర్రిగూడ, గుర్రంపోడు, పీఏపల్లి, కొండమల్లేపల్లి మండలాలు ఉన్నాయి. అగ్ని ప్రమాదం జరిగిందన్న సమాచారం వెంటనే అగ్నిమాపక కేంద్ర అధికారులు బుల్లెట్ వాహనం, అగ్నిమాపక వాహనంతో సంఘటన స్థలానికి చేరుకొని సకాలంలో మంటలను ఆర్పుతున్నారు. భారీగా ఆస్తి నష్టం జరిగిన సంఘటనలు రెండు చోటు చేసుకున్నాయి. దేవరకొండ పట్టణంలోని లీమ్యానాయక్ అనే టీచర్ ఇంట్లో గ్యాస్ సిలిండర్ పేలడంతో మంటలు వ్యాపించాయి. సకాలంలో వెళ్లి మంటలు ఆర్పడంతో ఆస్తినష్టం భారీగా జరగలేదు. ఈ ఏడాది మార్చిలో కొండమల్లేపల్లిలోని ఓ కట్టెల మిల్లులో అగ్ని ప్రమాదం జరిగి రూ.20లక్షలకుపైగా ఆస్తి నష్టం జరిగింది. సమాచారం అందిన వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని మంటలు ఆర్పినట్లు అధికారులు తెలిపారు. అగ్నిమాపక కేంద్రానికి గ్రామాలు 70నుంచి 80కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. గత సంవత్సరం నుంచి ఎలాంటి పెద్ద సంఘటనలు జరగలేదు. అగ్నిమాపక కేంద్రంలో ఎస్ఐతోపాటు ఇద్దరు డ్రైవర్లు, 8మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. అగ్నిమాపక వాహనంలో 4,500 లీటర్ల నీరు ఉంటుంది. దేవరకొండ అగ్నిమాపక కేంద్రంలో రెండు బోర్లు, మంచినీటి ట్యాంకులు ఉన్నాయి.

వెంటనే సమాచారం ఇవ్వాలి

అగ్నిప్రమాదం సంభవిస్తే వెంటనే సెల్: 8712699322 నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలి. అగ్నిమాపక సిబ్బంది వాహనంతో అప్రమత్తంగా ఉంటారు. ప్రమాదం జరిగిన వెంటనే సకాలంలో సంఘటన స్థలానికి చేరుకొని మంటలు ఆర్పుతున్నాం. ఒకటి, రెండు సంఘటనలు మినహా గత సంవత్సరం పెద్ద ప్రమాదాలు జరగలేదు.

● రాజు, దేవరకొండ అగ్నిమాపక కేంద్ర అధికారి

నిప్పు ఆర్పేందుకు నీటి కొరత



నల్లగొండ/నల్లగొండ టౌన్, మే 7: అగ్నిప్రమాదాలు అత్యధికంగా సంభవించే వేసవి సీజన్‌లో నాగార్జునసాగర్ ప్రధాన కాల్వలు మూసి వేయ డంతో నీటి కోసం సిబ్బంది అనేక తంటాలు పడాల్సి వస్తోంది. కోదాడ, నకిరేకల్, దేవరకొండ, హుజూర్‌నగర్, మిర్యాలగూడ, హాలియా ఫైర్ స్టేషన్లలో సిబ్బంది నీటికోసం కుంటలు, చెరువుల వెంట పరుగులు తీయాల్సి వస్తోంది. సమయ స్ఫూర్తి నైపుణ్యం కలిగిన సిబ్బంది కొరత జిల్లాలో స్పష్టంగా కన్పిస్తోంది. మంటలు ఆర్ప డంలో కీలకపాత్ర పోషించే ఫైర్‌మన్ల సం ఖ్య కూడా తక్కువగానే ఉంది. ఫైర్‌స్టేషన్‌కు పది మంది చొప్పున సుమారు వం దకు పైగా ఫైర్‌మెన్‌లు పనిచేయాల్సి ఉంది. ఉమ్మడి జిల్లాలో ఒక్క ఫైర్‌స్టేషన్‌లో కూడా పూర్తి స్థాయిలో ఫైర్‌మన్లు ఉన్న దాఖాలాలు లేవు. ప్రతి స్టేషన్‌లో ఐదారుగురికి మించి లేరు. ప్రస్తుతం కాంట్రాక్ట్ పద్ధతిన పోలీస్ శాఖకు చెందిన హోంగార్డులు, ఆర్టీసీ డ్రైవర్ల సాయంతో పనులు పూర్తిచేస్తున్నట్లు సమాచారం.

బోర్లు ఎండితే..

కొన్ని స్టేషన్లలో బోర్ వసతితో పాటు నీటిని నిల్వ చేసుకునే వాటర్ ట్యాంకర్లు కూడా ఉన్నాయి. అయితే కొన్ని చోట్ల మాత్రం పూర్తిగా బోర్లపైనే ఆధారపడాల్సి వస్తుంది. ప్రస్తుతం వర్షభావ పరిస్థితుల నేపథ్యంలో భూ గర్భజలాలు అ డుగండడంతో మం దు వేసవిలో బోర్లు ఎండిపోతే అన్ని స్టేషన్ లలో నీటి కొరత తీవ్రంగా ఉంటుంది. తప్పని పరి స్థితు ల్లో మునిసిపల్ శాఖకు చెందిన వాటర్ ట్యాంకర్లు, చిన్నచిన్న చెరువు లు, కుంటలపై ఆధారపడాల్సి వస్తుంది.

పెరుగుతున్న ఆస్తి నష్టం

నాలుగేళ్ల నుంచి అగ్ని ప్రమాదాల సంఖ్య పెరగడంతో ఆస్తి, ప్రాణ నష్టం భారీగానే వాటిల్లుతుంది. ట్రాక్టర్లు, లారీలు మోతాదుకు మించి గడ్డి రవాణా చేస్తే జరిగే విద్యుత్ ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. అదేవిధంగా పంట కోతల తర్వాత మిగిలిన చెత్తను తగలబెట్టడం వల్ల జరిగే ప్రమాదాలు, పరిశ్రమలల్లో అగ్ని ప్రమా దాలు వంటి సంఘటనలు ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయి. 2020లో 846ప్రమాదాలు జరగగా 2021లో కరోనా సమయంలో ఆ సంఖ్య కాస్తా 434కు పడిపోయింది. 2022లో 560 ప్రమాదాలు జరగగా, ఈ ఏడాది ఈ సీజన్‌లో ఇప్పటికి 985 ప్రమాదాలు నమోదయ్యాయి ఆస్తి నష్టాన్ని పరిశీలిస్తే 2020లో రూ.43.98లక్షల నష్టం వాటిల్లగా రూ.111.83కోట్ల ఆస్తిని కాపాడారు. అదేవిధంగా 2021లో రూ.38.64లక్షల నష్టం వాటిల్లగా రూ.17.44కోట్ల ఆస్తిని కాపాడారు. 2022లో రూ.5.93కోట్లు ఆస్తి నష్టం జరగగా రూ.18.73కోట్ల ఆస్తిని కాపాడారు. 2023కు వచ్చే సరికి రూ.58.25కోట్ల ఆస్తి నష్టం జరగగా రూ.154.80కోట్ల ఆస్తిని కాపాడగలిగారు. నాలుగేళ్లలో 101మంది వేర్వేరు అగ్ని ప్రమాదాల్లో మృత్యువాత పడ్డారు. 71మందిని అగ్నిమాపక శాఖ కాపాడింది.

సిబ్బంది కొరత అధిగమిస్తాం

అగ్ని ప్రమాదాలు జరిగినట్లు ఫిర్యాదులు వచ్చిన వెంటనే స్పందించి నివారణ చర్యలు చేపడుతున్నాం. శాఖలో సిబ్బంది కొరత ఉన్నా అధిగమించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇటీవల అగ్నిమాపక శాఖకు సంబంధించి 500మంది ఫైర్‌మన్లు, 200మంది డ్రైవర్లను నియమించారు. శిక్షణ పూర్తికాగానే సిబ్బంది కొరత తీరుతుంది. అత్యవసర పరిస్థితుల్లో నీటి కొరత రాకుండా చర్యలు తీసుకుంటున్నాం. అన్ని ఫైర్‌స్టేషన్లో బోర్ పాయింట్‌లతో పాటు నీటిని స్టోర్ చేసుకునేందుకు ట్యాంకులను కూడా ఏర్పాటు చేసుకున్నాం.

● సందేశ్ కుమార్ జిల్లా అగ్నిమాపక అధికారి, నల్లగొండ.

ఏడు మండలాలకు ఒక్కటే..



హుజూర్‌నగర్: హుజూర్‌నగర్‌లోని అగ్నిమాపక కేంద్రంలో అరకొర వసతులతో కాలం వెళ్లదీస్తున్నారు. పట్టణంలోని ఫైర్‌స్టేషన్‌లో మౌలిక వసతులు కరువయ్యాయి. హుజూర్‌నగర్ సర్కిల్ పరిధిలో ఏడు మండలాలు ఉండగా ఒక్కటే ఫైరింజన్ ఉంది. పట్టణంలోని సర్కిల్ ఫైర్‌స్టేషన్‌కు నియోజకవర్గంలోని వజినేపల్లి, పాలకవీడు మండలం శూన్య పహడ్ లాంటి ప్రాంతాలు సుమారు 50కిలోమీటర్ల దూరం విస్తరించి ఉంది. కాగా ప్రమాదం ఒక చోట జరిగితే మరో చోటుకు వెళ్లాలంటే ఫైర్ సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అటు చివర పాలకవీడు మండలంలోని శూన్యపహడ్, జాన్‌పహడ్ లాంటి ప్రాంతాలు ఉండగా అక్కడ నుంచి నేరేడుచర్ల, గరిడేపల్లి మండలాలతో పాటు మఠంపల్లి మండలం మేళ్లచెర్వు, చింతలపాలెం మండలంలోని బుగ్గమాధారం, వజినేపల్లి, మఠంపల్లి మండలంలోని గుండ్లపహడ్, రఘునాథపాలెం లాంటి ప్రాంతాలు చాలా దూరం ఉన్నాయి. ప్రస్తుతం ఉన్న ఫైరింజన్ ఒక్కటే సరిపోవడం లేదు. మరో ఫైరింజన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ ఉంది. హుజూర్‌నగర్ ఫైర్‌స్టేషన్‌లో 16మంది ఉద్యోగులు ఉండాల్సి ఉండగా 10మంది తో నెట్టుకొస్తున్నారు. స్టేషన్ ఫైర్ అధికారి కూడా ఇన్‌చార్జిగా ఉన్నారు. పట్టణంలో ప్రమాదాలు జరిగినప్పుడు ఫైరింజన్‌కు నీరు ఎక్కించాలంటే మోటార్ సక్రమంగా పనిచేయడం లేదు. 2022లో 70 ప్రమాదాలు జరిగాయి. రూ.2.68కోట్ల ఆస్తి కాపాడగలిగారు. 2023లో 86 ప్రమాదాలు జరగగా రూ.2.50కోట్ల నష్టాన్ని కాపాడారు.

ప్రమాదాల నివారణకు కృషిచేస్తున్నాం

ప్రమాదాల నివారణకు కృషి చేస్తున్నాం. రెండు సంవత్సరాల్లో సుమారు ఐదున్నర కోట్ల విలువ చేసే ఆస్తిని కాపాడగలిగాం. అందుబాటులో ఉన్న వనరులతో విధులు నిర్వహిస్తున్నాం.

● శ్రీనివాసరావు, ఇన్‌చార్జి ఫైర్ అధికారి.

పారిశ్రామిక ప్రాంతం.. ఒక్కటే అగ్నిమాపక కేంద్రం



చౌటుప్పల్: చౌటుప్పల్ ఫైర్‌స్టేషన్లో వసతులు సౌకర్యాలు ఉన్నా సిబ్బంది కొరత వేధిస్తోంది. చౌటుప్పల్ అగ్నిమాపక కేంద్రం పరిధిలో చౌటుప్పల్, సంస్థాన్‌నారాయణపురం, గట్టుప్పల మండలాలు ఉన్నాయి. సొంత భవనం, మంచినీటి వసతి, కండిషన్లో ఉన్న వాహనం ఉంది. ప్రమాదం జరిగినప్పుడు వెంటనే సంఘటన స్థలానికి వెళ్లేందుకు ఎలాంటి ఆటంకాలు లేవు. చౌటుప్పల్ రోజురోజుకు పారిశ్రా మికంగా మరింత అభివృద్ధి చెందుతోంది. మండలంలోని దండుమల్కాపురం గ్రామంలో దేశంలోనే మొట్టమొదటి గ్రీన్ ఇండస్ట్రియల్ పార్కు సైతం ఏర్పాటైంది. ఏదైనా పరిశ్రమలో పెద్ద ఎత్తున అగ్నిప్రమాదం సంభవించినప్పుడు పరిసర ప్రాంతాల ఫైర్ ఇంజన్లను సైతం ఇక్కడికి రప్పిస్తారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో చౌటుప్పల్ మండలంలో అదనంగా మరో ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయాల్సిన అసరముంది. అందులో భాగంగా మండలంలోని దండు మల్కాపురం గ్రామంలో నూతన ఫైర్‌స్టేషన్ ఏర్పాటుకు గతంలో అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఆ ప్రతిపాదనలు నేటికీ కార్యరూపం దాల్చడం లేదు. అగ్నిమాపక కేంద్రంలో మొత్తం 16మంది ఉండాల్సి ఉండగా ఎనిమిది మంది మాత్రమే ఉన్నారు. ఫైర్ ఎస్ఐ పోస్ట్ ఖాళీగా ఉంది. డ్రైవర్, ఆపరేటర్ పోస్టు, నాలుగు ఫైర్‌మెన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

● చౌటుప్పల్ అగ్నిమాపక కేంద్రం ఫోన్ నెంబర్ : 8712699334

వ్యవసాయ బావుల వద్ద నీళ్లు నింపుకొనే పరిస్థితి



రామన్నపేట: రామన్నపేట అగ్నిమాపక కేంద్రంలో నీటి వసతి ట్యాంక్ సరిగా లేకపోవడంతో ప్రమాదాలు జరిగినప్పుడు తీవ్ర ఇబ్బందులు జరుగుతున్నాయి. పాత ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో 2008లో అగ్నిమాపక కేంద్రం కేంద్రం ఏర్పాటు చేశారు. దీని పరిధిలో వలిగొండ, రామన్నపేట, మండలాలు ఉన్నాయి. అగ్ని ప్రమాదాలు జరిగిన సమయంలో చిట్యాల, నార్కెట్‌పల్లి మండలాలకు కూడా వెళ్తుంటారు. 2022-2023 సంవత్సరంలో 37ప్రమాదాలు జరిగాయి. పెద్దకాపర్తి, పిట్టంపల్లిలలో ఏరినా కంపెనీలో రియాక్ట్ కాలిపోవడంతో పత్తి మిల్లులలో మండలు చెలరేగడంతో వాటిని అదుపు చేయడంతో రూ.10 కోట్ల నష్టం కాకుండా కాపాడారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మండల విద్యాధికారి కార్యాలయం, అగ్నిమాపక కేంద్రం ఒకే చోట ఉండడంతో ప్రమాదాలు జరిగినప్పుడు వెళ్లడానికి దారిలో తీవ్ర ఆటంకాలు కలుగుతుంటాయి. వాటర్ ట్యాంక్ లేకపోవడంతో వ్యవసాయ బావుల వద్దకు వెళ్లి ట్యాంక్‌లో నీళ్ల నింపువాల్సి వస్తోంది. అగ్నిమాపక కేంద్రంలో ప్రస్తుతం 13 మంది సిబ్బంది పని చేస్తున్నారు. అగ్నిమాపక కేంద్రం రేకులషేడ్, ఆఫీస్ గదిలో ఉంది. అది కూడా వర్షం వచ్చినప్పుడు కురుస్తుంటుంది. వాటర్ ట్యాంక్ లేకపోవడంతో వల్ల ఇబ్బంది కలుగుతుందని రామన్నపేట ఔట్‌సోర్సింగ్ అగ్నిమాపక కేంద్రం ఇన్‌చార్జి అధికారి సాయిదీప్ తెలిపారు. ప్రస్తుతం ఉన్న బోర్‌లో సరిపోను నీళ్ల రావడంలేదన్నారు.

● రామన్నపేట కేంద్రం సెల్ నెంబర్ 8712699344

శిథిలావస్థకు చేరిన వాహనాలతోనే..



మిర్యాలగూడ అర్బన్: మిర్యాలగూడ నియోజవర్గంలోని అడవిదేవులపల్లి, దామరచర్ల, మాడ్గులపల్లి మండలాల పరిధిలోని శివారు గ్రామాలకు చేరుకునేందుకు దాదాపు 2 నుంచి 3 గంటల సమయం పడుతోంది. అప్పటికే రగులుకున్న అగ్గితో ఆస్తినష్టం జరిగిపోతోంది. 20 కిలోమీటర్ల దూరంలో ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని అగ్నిమాపకశాఖ ఉన్నతాధికారులు గత ప్రభుత్వాలకు నివేదించినప్పటికీ ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. దీనికి తోడు కొత్తవాహనాలు సమకూర్చకపోవడంతో శిథిలావస్థకు చేరిన వాహనాలతోనే సిబ్బంది నెట్టుకొస్తున్నారు. మిర్యాలగూడ అగ్నిమాపక కేంద్రంలో వేసవిలో నీటి కొరత అధికమవుతోంది. ప్రస్తుతం కేంద్రంలో ఉన్న బోరుబావిలో జలాలు అడుగంటిపోయాయి. దీంతో కేంద్రం ఆవరణలోని నీటిట్యాంకును నింపేందుకు సిబ్బంది పాట్లు పడుతున్నారు. అరకొరగా లభించే నీటితో ట్యాంకర్‌ను నింపాలంటే దాదాపు గంటన్నర సమయం పడుతోంది. మునిసిపాలిటీ పరిధిలోని బోరుబావి నుంచి నీటిని తోడుకునేందుకు పాలకవర్గం అంగీకరించడం లేదు. ప్రైవేట్ బోరుబావి వద్ద ట్యాంకర్‌లో నీటిని నింపుకొని సిబ్బంది సిద్ధంగా ఉంటున్నారు. సిబ్బంది కొరత ఉంది. ప్రస్తుతం హోంగార్డులను డిప్యూటేషన్‌పై తీసుకొని సేవలు అందిస్తున్న పరిస్థితి.

● మిర్యాలగూడ అగ్నిమాపక కేంద్రం ఫోన్ నెంబర్ : 9490867069

సూర్యాపేట, తుంగతుర్తికి ఒకటే అగ్నిమాపక కేంద్రం



(సూర్యాపేట, ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లాలో ఇంకా పూర్తిస్థాయిలో అగ్నిమాపక కేంద్రాలు లేవు. సూర్యాపేటలో అగ్నిమాపక కేంద్రం ఒకటి ఉండగా కోదాడ, హుజూర్‌నగర్‌లల్లో మాత్రమే అగ్నిమాపక కేంద్రాలు ఉన్నాయి. సుదూర ప్రాంతాలకు వెళ్లే లోపే అప్పటికే నష్టం జరిగిపోతుంది. ఉదాహరణకు హుజూర్‌నగర్ నియోజకవర్గం నుంచి మేళ్లచెర్వు, చింతలపాలెం, పాలకీడు మండలాల్లోని గ్రామాల్లో అగ్ని ప్రమాదం జరిగిందంటే వెళ్లేందుకు గంటన్నర పడుతుంది. ఈలోపు జరగాల్సిన నష్టం జరుగుతుంది. ఇటీవల జిల్లాకేంద్రంలో కారు, బస్సు, గడ్డివాములు దగ్ధమయ్యాయి. సూర్యాపేట, తుంగతుర్తి నియోజక వర్గాలకు ఒకటే అగ్నిమాపక కేంద్రం ఉండడంతో ప్రమాదాలు జరిగినప్పుడు అగ్నిమాపక సేవలందడం లేదు. తుంగతుర్తి నియోజకవర్గంలో అగ్ని ప్రమాదాలు జరిగితే సూర్యాపేట, మోత్కూరు నుంచి అగ్నిమాపక వాహనాలు వెళ్లాల్సిన పరిస్థితి.

జిల్లాలో 265 అగ్ని ప్రమాదాలు

2023 జనవరి నుంచి నేటి వరకు సూర్యాపేట అగ్నిమాపక శాఖ పరిధిలో 265 ప్రమాదాలు జరిగాయి. ఒక్క సూర్యాపేట స్టేషన్ పరిదిలో 132 అగ్నిమాపక ప్రమాదాలు జరిగాయి. ఇందులో ఆరు రిస్క్ కాల్స్‌గా అధికారులు చెబుతున్నారు. జిల్లావ్యాప్తంగా 68శాతం వ్యవసాయానికి సంబంధించినవి కాగా 12శాతం గృహోపకరణానికి సంబంధించినవి నాలుగు శాతం స్టోరేజీ, గోడౌన్‌కు సంబంధించిన అగ్ని ప్రమాదాలు జరిగాయి. 16శాతం ఇతర కారణాలతో ప్రమాదాలు జరిగాయి. ఏడాదిలో సుమారు రూ.2.50కోట్ల విలువ గల ఆస్తి నష్టం అగ్ని ప్రమాదాల వల్ల కల్గింది. సుమారు రూ.3నుండి రూ.3.50కోట్లదాకా ఆస్తి నష్టం కలగకుండా అగ్నిమాపక కేంద్రం రక్షించింది. జిల్లాలో 133 అగ్నిమాపక అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. తుంగతుర్తి నియోజక వర్గ పరిధిలో ప్రమాదాలు జరిగితే సూర్యాపేట నుంచి సుమారు 40 నుంచి 50కిలో మీటర్ల దూరం వరకు గల ప్రమాద స్థలాలకు అగ్ని మాపక వాహనం చేరుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. తుంగతుర్తి నియోజక వర్గానికి అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కొన్నేళ్లుగా ఆ ప్రాంత ప్రజలు, ప్రజా సంఘాల నాయకులు, రాజకీయ పార్టీల నాయకులు ఆందోళనలు చేసినా ఫలితం లేకుండా పోయింది.

అందుబాటులో ఉన్న వాహనాలు

సూర్యాపేట అగ్నిమాపక కేంద్రంలో ఒక అగ్నిమాపక వాహనంతో పాటు మరికొన్ని వాహనాలు అందుబాటులో ఉన్నాయి. ఇరుకు ప్రాంతాలలో ప్రమాదాలు జరిగితే అగ్నిమాపక వాహనం వెళ్లలేని పరిస్థితి నెలకొంది. అందుకోసం ఇటీవల ఇక మినీ అగ్నిమాపక వాహనంతో పాటు మిస్ట్‌బుల్లెట్‌ను అందుబాటులో ఉంచారు. ఈ రెండు వాహనాల వల్ల ఇరుకు ప్రదేశాలలో ప్రమాదాలు జరిగితే ఈ వాహనాలు తక్షణమే ప్రమాద స్థలాలకు చేరుకొని ప్రమాదాలు నివారించే అవకాశాలున్నాయి. ప్రమాదం జరిగితే సూర్యాపేట కేంద్రం సెల్:8712699328. 8712699332, కోదాడ 8712699330, మోత్కూరు పరిధిలో 8712699344కు సమాచారం ఇవ్వవచ్చు.

నిబంధనలు అంతంతమాత్రమే

జిల్లాకేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రుల్లో పూర్తిస్థాయిలో అగ్ని నివారణ యంత్రాలు, నిబంధనలు పాటించడంలేదని ఆరోపణలు ఉన్నాయి. అపార్ట్‌మెంట్ సంస్కృతి పెరుగుతుండడంతో ఏ చిన్న ప్రమాదం జరిగినా మంటలు వ్యాపించకుండా కనీస నిబంధనలు పాటించడంలేదు.

సమాచారం అందిన వెంటనే స్పందిస్తున్నాం



సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గాల పరిధిలో ఎక్కడైనా అగ్ని ప్రమాదం జరిగినట్లు సమాచారం అందగానే వెంటనే స్పందిస్తున్నాం. అగ్ని ప్రమాద సమయంలో 101కి డయల్ చేయాలి. సూర్యాపేటలో అగ్ని ప్రమాదాలను నివారించే సమయంలో తుంగతుర్తి ప్రాంతంలో అగ్ని ప్రమాదానికి సంభవించిన సమాచారం వస్తే మరో అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇస్తున్నాం.

● శ్రీనివాస్ సూర్యాపేట అగ్నిమాపక అధికారి

వాహనం నిలిపేది తాత్కాలిక రేకుల షెడ్డులోనే


యాదగిరిగుట్టలోని తాత్కాలిక అగ్నిమాపక కేంద్రం

యాదగిరిగుట్ట రూరల్: యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణంలోని అగ్నిమాపక కేంద్రంలో సమస్యలు తిష్ట వేశాయి. 2019లో తుర్కపల్లి, రాజపేట, యాదగిరిగుట్ట మండలాలను కలిపి అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేశారు. ఇక్కడ నీటి సమస్య, సిబ్బంది కొరత, పక్కా భవనం లేదు. మంటలు ఆర్పడానికి ఫైర్ ఇంజన్‌లో నీరు నింపాలంటే ప్రైవేట్ బోరు బావులు ఆశ్రయించాల్సిందే. సిబ్బంది కొరత కూడా వెంటాడుతోంది. ఆకస్మికంగా ప్రమాదాలు జరిగినప్పుడు కొంతవరకు ఇబ్బందులు తప్పలేదు. అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేసి ఆరు సంవత్సరాలు గడిచినా ఇప్పటి వరకు పక్కభవన లేదు. ఇటీవల కాలంలో నూతన భవన నిర్మాణం కోసం చేపట్టిన పనులు నత్తనడుక కొనసాగుతున్నాయి. ఫైర్ వాహనం నిలిపేందుకు అప్పట్లో దాతలు ఇచ్చిన రేకుల షెడ్ మాత్రమే ఉంది.

ఇండోర్ స్టేడియంలో కొనసాగుతున్న ఫైర్‌స్టేషన్

ఆలేరు రూరల్: ఆలేరులోని అగ్నిమాపక కేంద్రానికి సొంత భవనం లేక ఇండోర్ స్టేడియంలో కొనసాగుతున్నది. అగ్నిమాపక కేంద్రం పరిధిలో కింద ఆలేరు, మోటకొండూరు మండలాలు ఉన్నాయి. 2022-23 సంవత్సరంలో 24అగ్ని ప్రమాదాలు కేసులు నమోదయ్యాయి. రూ.6.90లక్షల నష్టం జరిగింది. సమాచారం అందుకొని రూ.31.90లక్షల ఆర్థిక నష్టాన్ని ఆపగలిగారు. ఫైర్ స్టేషన్‌లో 17 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ఆలేరు మునిసిపాలిటీలోని ఎస్సీ కాలనీలో వద్ద ఉన్న పంపువద్ద, ఆలేరులోని పెద్ద వాగు వద్ద ఉన్న పంపు వద్ద ఈ వాహనాన్ని నింపుతారు. ప్రతి సంవత్సరం ఏప్రిల్ 14న ఫైర్ సేఫ్టీ విషయమై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. భవన నిర్మాణం కోసం స్థలం కేటాయించాలని సొంత భవనం కోసం నిధులు కేటాయిస్తే భవన నిర్మాణం చేపడుతామని ఎస్ఎఫ్‌వో సయ్యద్ సోయబుల్లా తెలిపారు. ప్రమాదం జరిగిన సమా చారం అందిన వెంటనే బయలుదేరి ప్రమాద స్థలానికి చేరుకొని నివారించేందుకు కృషి చేస్తామని ఆయన తెలిపారు.

● ఆలేరు అగ్నిమాపక కేం ద్రం ఫోన్ నెంబర్ 8712699340, 8712699341



ఆంధ్రజ్యోతి ఫోకస్ focus

అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తత అవసరం

కోదాడ: కోదాడ అగ్నిమాపక కేంద్రం పరిధిలో కోదాడ, అనంతగిరి, మునగాల, నడిగూడెం, చిలుకూరు మండలాలు ఉన్నాయి. వేసవిలో అగ్నిప్రమాదాలు జరకుండా అప్రమత్తంగా ఉండాలని కోదాడ ఫైర్‌స్టేషన్ అధికారి శ్రీరామలింగం సూచించారు. కోదాడ 2022-23లో సంవత్సరంలో 138 ప్రమాదాలు జరిగాయి. ఈ ప్రమాదాల్లో రూ3కోట్ల2లక్షల83వేల ఆస్తి కాపాడారు. రూ. 1.97 కోట్ల ఆస్తి నష్టం వాటిల్లింది. అదే విధంగా ప్రమాదాల నుంచి ఇద్దరు బయటపడ్డారు. ఏడుగురు మృతిచెందారు. అగ్నిమాపక కేంద్రంలో ప్రస్తుతం 8మంది సిబ్బంది కొరత ఉంది. నీటి సదుపాయం అవసరం మేర ఉంది. అగ్ని ప్రమాదాలు జరగకుండా ప్రజలతో, పాఠశాల, కళాశాల విద్యార్థులు అవగాహన కల్పిస్తున్నారు.

● కోదాడ అగ్నిమాపక కేంద్రం ఫోన్ నెంబర్లు 8712699330, 8712699331

భువనగిరిలో ఏడాదిన్నరలో 104 ఫైర్ కాల్స్

భువనగిరి టౌన్: భువనగిరి అగ్ని మాపక కేంద్రం పరిధిలో భువనగిరి, బీబీనగర్, బొమ్మలరామారం మండలాలు ఉన్నాయి. గత ఏడాదిన్నర వ్యవధిలో అగ్ని మాపక కేంద్రానికి 104 ఫైర్ కాల్స్ వచ్చాయి. ఈ ఘటనల్లో సుమారు రూ.29కోట్ల ఆస్తినష్టం జరిగింది. 2023లో వచ్చిన ఫైర్ కాల్స్‌లో బొమ్మాయిపల్లిలో నడుస్తున్న రైలులో వెలువడిన మంటలతో రూ.కోటికి పైగా ఆస్తినష్టం జరిగింది. ప్రమాదం జరిగిన వెంటనే భువనగిరి అగ్నిమాపక కేంద్రంతో పాటు పరిసర ప్రాంతాల్లోని అగ్నిమాపక కేంద్రాల సిబ్బంది సంఘటనా సకాలంలో స్థలానికి చేరుకోవడంతో ప్రాణ నష్టం జరగలేదు. పైగా మరిన్ని బోగీలకు మంటలు వ్యాపించకుండా నియంత్రించారు. మరో 64సంఘటనల్లో రూ.65లక్షలు ఆస్తినష్టం జరిగింది. 2024లో భువనగిరి మండలంలోని నాగిరెడ్డిపల్లి సమీపంలో ఓ పత్తి గోదాములో జరిగిన అగ్ని ప్రమాదంలో ఆరు అగ్ని మాపక వాహనాలు మూడు రోజుల పాటు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. అయినప్పటికీ రూ.27.50 కోట్ల పత్తి దగ్ధం కాగా అంతకు రెట్టింపు పత్తిని అగ్ని మాపక సిబ్బంది కాపాడారు. మరో 39 సంఘటనల్లో సుమారు రూ.50 లక్షల ఆస్తినష్టం జరగగా ఒకరు చెరువులో మునిగి మృతిచెందారు. అగ్ని మాపక కేంద్రంలోని బోరు బావి ప్రధాన వనరుగా ఉన్నా స్థానిక నల్లగొండ చౌరస్తాలోని రియల్టర్ బెల్లంకొండ ఉపేందర్ తన వ్యవసాయ బావి వద్ద నుంచి అగ్ని మాపక వాహనానికి అవసరమైన నీటిని స్వచ్ఛందంగా అందిస్తున్నారు. బీబీనగర్‌లోని పారిశ్రామిక వాడ భద్రత కోసం గతంలో ఆ ప్రాంతంలో అగ్ని మాపక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ప్రతిపాదించినప్పటికీ అమలుకు నోచుకోలేదు. ఎయిమ్స్ ఆసుపత్రిలో అగ్నిమాపక కేంద్రం నిర్మాణం పనులు ప్రారంభమయ్యాయి.

ప్రతి కాల్‌కు స్పందిస్తున్నాం



ఫైర్ స్టేషన్‌కు వచ్చే ప్రతి కాల్‌కు స్పందిస్తున్నాం. కాల్ వచ్చిన వెంటనే సంఘటనా స్థలానికి వెళ్లి ప్రమాద తీవ్రతను అరికడుతున్నాం. బొమ్మాయిపల్లిలో రైలు, నాగిరెడ్డిపల్లిలో పత్తిగోదాములో మరింత ఆస్తినష్టం, ప్రాణ నష్టాన్ని నివారించగలిగాం. అగ్ని ప్రమాదాల నివారణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రతీ ఏటా ఏప్రిల్ 14 నుంచి 20 వరకు అగ్ని మాపక వారోత్సవాలు నిర్వహించి అవగాహన కల్పిస్తున్నాము.

● అశోక్, ఇన్‌చార్జి అధికారి, అగ్నిమాపక కేంద్రం, భువనగిరి.

సొంత భవన నిర్మాణానికి స్థలం కరువు

మోత్కూరు: మోత్కూరు మండల కేంద్రంలో నిరుపయోగంగా ఉన్న ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయ భవనంలో 2018లో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేశారు. కార్యాలయం ఎదుట షెడ్ వేసి అగ్నిమాపక యంత్రాన్ని ఉంచుతున్నారు. సొంత స్థలం కాకపోవడంతో అగ్నిమాపక కేంద్రంలో బోరువేయలేదు. దీంతో నీటి సౌకర్యం లేకుండా పోయింది. ఎక్కడైనా అగ్ని ప్రమాదం జరిగినప్పుడు ప్రైవేటు వ్యక్తుల బోరు, మునిసిపాలిటీ బోరు నుంచి లేదా చెరువులు, కుంటల నుంచి నీరు నింపుకోవాల్సిన దుస్థితి నెలకొంది. మోత్కూరు అగ్నిమాపక కేంద్రం పరిధిలో మోత్కూరు, ఆత్మకూరు(ఎం), గుండాల, అడ్డగూడూరు మండలాలు ఉన్నాయి. అప్పుడప్పుడు తిరుమలగిరి, నాగారం మండలాలు కూడా వెలుతున్నారు. మోత్కూరు ఫైర్ ఆఫీర్ సాయిదీపక్. ఆఫీసు ఫోన్ నంబరు 8712699342, అధికారి ఫోన్ నంబరు 8712699343. 2023 సంవత్సరంలో (జనవరి నుంచి డిసెంబరు వరకు)మోత్కూరు అగ్నిమాపక కేంద్రం పరిధిలో 28 కాల్స్ అటెండ్ చేశారు. (అగ్నిప్రమాదాల్లో మంటలు చల్లార్చారు). 28 ప్రమాదాల్లో రూ.57.45 లక్షల ఆస్తినష్టం జరగ్గా, రూ.92.86లక్షల విలువ కల్గిన ఆస్తి కాలిపోకుండా కాపాడారు. ఒక రెస్క్యూ కాల్ అటెండ్ చేసి ఒక వ్యక్తిని ప్రాణాపాయం నుంచి రక్షించారు.

- మోత్కూరు అగ్నిమాపక కేంద్రంలో సిబ్బంది కొరత పెద్దగా లేనప్పటికీ ముగ్గురు డ్రైవర్లు ఉండాల్సి ఉండగా ఇద్దరు డ్రైవర్లు ఉన్నారు.
- గతంలో మోత్కూరు అగ్నిమాపక కేంద్రంలో మల్టిపర్పస్ వాటర్ టెండర్ వాహనం ఉండగా కొంత కాలం క్రితం ఆ వాహనాన్ని పరిశ్రమలు ఎక్కువగా ఉన్న ప్రాంతమని చౌటుప్పల్‌కు పంపి, ఇక్కడ వాటర్ టెండర్ వాహనాన్ని ఉంచారు.
- ప్రతి శుక్రవారం కూడలి స్థలాల్లో, ప్రజలు ఎక్కువగా ఉన్నచోటుకు వెళ్లి అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్నారు. ప్రతి ఏడాది ఏప్రిల్ 14 నుంచి 20 వరకు అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహిస్తూ ప్రజలకు అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్నారు.
- ప్రతి అగ్నిమాపక కేంద్రంలో నీటి సౌకర్యం కోసం ఒక బోరు, సుమారు లక్ష లీటర్ల సామర్థ్యం కలిగిన ట్యాంక్(సంప్) ఉండాలి. మోత్కూరు కార్యాలయం సొంత స్థలం కాకపోవడంతో ఆ సౌకర్యం లేదు. అగ్నిమాపక శాఖ వారు మోత్కూరులో సొంత కార్యాలయం నిర్మించడానికి సిద్ధంగా ఉన్నా మోత్కూరులో ప్రభుత్వ స్థలం చూపించడం లేదని చెబుతున్నారు. ఎక్కడైనా ఎకరం నుంచి రెండెకరాలు ప్రభుత్వ స్థలం ఇచ్చినట్టయితే అగ్నిమాపక కేంద్రానికి అన్ని సౌకర్యాలతో సొంత భవనం నిర్మించేందుకు అగ్నిమాపక శాఖ సిద్ధంగా ఉందని సంబంధిత అధికారులు చెబుతున్నారు.

కాంగ్రెస్‌లో చేరిన వారికి ప్రాధాన్యం కల్పిస్తాం

● ఎమ్మెల్యే పద్మావతి ● ప్రచారంలో పాల్గొన్న పటేల్ రమేష్‌రెడ్డి, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి తదితరులు




పెన్‌పహాడ్ మండలం భక్తాళాపురం గ్రామంలో ప్రచారంలో పాల్గొన్న రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, హాజరైన ప్రజలు

కోదాడ, కోదాడ రూరల్, నడిగూడెం, సూర్యాపేట టౌన్, పెన్‌పహాడ్, కోదాడ టౌన్, మఠంపల్లి, మేళ్లచెర్వు, హుజూర్‌నగర్, మద్దిరాల, నూతనకల్, మోతె, మే 8: కాంగ్రెస్ పార్టీలో చేరినవారికి తగిన ప్రాధాన్యం కల్పిస్తామని ఎమ్మెల్యే పద్మావతి అన్నారు. కోదాడ బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు చందు నాగేశ్వరరావు, బీఆర్ఎస్ యూత్ నాయకుడు ప్రతాపరెడ్డి, కౌన్సిలర్ వంటిపులి రామశ్రీనుతో పాటు పలువురు ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. చేరారు. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడారు.

● నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి రఘువీర్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ కోదాడ మండలంలోని కాపుగల్లు గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ఐదు వేల మంది పాల్గొని ఎమ్మెల్యే పద్మావతికి ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంపీపీ మల్లెల రాణిబ్రహ్మయ్య, జడ్పీటీసీ కృష్ణకుమారి, గ్రామ మాజీ సర్పంచ్ తొండపు సతీష్, పార్టీ మండల అధ్యక్షుడు వరప్రసాద్‌రెడ్డి, రేవూరి వెంకటాచారి, అమరనాయిని వెంకటేశ్వరరావు, ఉన్నం హనుమంతరావు, నంబూరి సూర్యం, ఇర్ల సీతారాంరెడ్డి, బాలెబోయిన రాజు, రామారావు పాల్గొన్నారు.

● అమరవీరుల త్యాగాలతోనే దేశానికి స్వాతంత్ర్యం, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సాధ్యమైందని ఎమ్మెల్యే పద్మావతిఅన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి రఘువీర్‌రెడ్డిని గెలిపించాలని కోరతూ నడిగూడెం మండలంలోని వల్లాపురంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బి.వెంకటరెడ్డి, మాజీ జడ్పీటీసీ నాగయ్య, సురేందర్‌రెడ్డి, పల్లా యుగంధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

● నడిగూడెం మండలంలోని కరివిరాలకు చెందిన బీఆర్ఎస్ ఎంపీటీసీ రుణబోతు రమాదేవిరాంరెడ్డి, మాజీ సర్పంచ్ పాతకొట్ల నాగేశ్వరావు, బొడ్డు శ్రీనుతో పాటు పలు కుటుంబాలు ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరాయి.



సూర్యాపేటలో కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న పటేల్ రమేష్‌రెడ్డి

● అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం 90శాతం అమలుచేసిందని తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పటేల్ రమేష్‌రెడ్డి అన్నారు. నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ బుధవారం జిల్లా కేంద్రంలోని 17, 41 వార్డుల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ రాముడి పేరుతో ఓట్ల రాజకీయాలకు తెరలేపారన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. అనంతరం వివిధ పార్టీలకు చెందిన నాయకులు పటేల్ రమేష్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ప్రచారంలో కౌన్సిలర్లు షఫీవుల్లా, వెలుగు వెంకన్న, నాయకులు గట్టు శ్రీనివాస్, జ్యోతిక ర్థాకర్, వీరమల్లుయాదవ్, తండు వెంకన్నగౌడ్, బైరబోయిన శ్రీనివాస్, వల్దాస్ దేవేందర్, కుమ్మరికుంట్ల లింగయ్య, జానకిరాములు పాల్గొన్నారు.

● పదేళ్ల పాటు ప్రజావ్యతిరేక పాలన సాగించిన బీజేపీ, బీఆర్ఎస్ నాయకుల మాటలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి రఘువీర్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ జిల్లా కేంద్రంలో, పెన్‌పహాడ్ మండలంలోని 12గ్రామాల్లో పచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ కనుమరుగవుతుందని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేశామని తెలిపారు. ఈనెల 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి, ఈనెల 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను అలియాస్ చింతపండ నవీన్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో రాంరెడ్డి సర్వోత్తంరెడ్డి, కొప్పుల వేణారెడ్డి, గోదాల రంగారెడ్డి, తూముల సురేష్‌రావు, గోదల రంగారెడ్డి, పిన్నాని కోటేశ్వర్‌రావు, కొండపల్లి దిలీప్‌రెడ్డి, నల్లపు రాంమూర్తి, శేషాలక్ష్మి, చింతం వెంకటేశ్వర్లు, మామిడి వెంకన్న, ఎడ్ల వెంకట్‌రెడ్డి, దొంతగాని రాంబాబు, నారాయణ ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు.

● కాంగ్రెస్ పార్టీతోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు అన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ కోదాడలోని 12, 34వార్డుల్లో కౌన్సిలర్లు గుండపునేని నాగేశ్వరరావు, గంధం యాదగిరి, కాంగ్రెస్ నాయకులతో కలిసి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడం కాంగ్రెస్ ప్రభుత్వానికే సాధ్యమవుతుందని అన్నారు. ప్రచారంలో మునిసిపల్ చైర్మన్ సామినేని ప్రమీల, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు వంగవీటి రామారావు, డీసీసీ ఉపాధ్యక్షుడు పార సీతయ్య, మహబూబ్ జానీ, కందుల కోటేశ్వరరావు, సీపీఎం నాయకులు, ముత్యాలు, కాటంరెడ్డి ప్రసాద్‌రెడ్డి, అంబటికర శ్రీను, చందా నిర్మల పాల్గొన్నారు.

● కాంగ్రెస్ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డిని గెలిపించాలని ఆ పార్టీ మఠంపల్లి మండల అధ్యక్షుడు భూక్య మంజునాయక్ కోరారు. మఠంపల్లి మండలంలోని మఠంపల్లి, బక్కమంతులగూడెం, పెదవీడు, భీల్యానాయక్, గుర్రంబోడుతండా, చెన్నాయిపాలెం, మంచ్యాతండా, రఘునాథపాలెం, చౌటపల్లి తదితర గ్రామాల్లో సీపీఎం నాయకులతో కలిసి ప్రచారం చేశారు. కార్యక్రమంలో ఆదూరి కిషోర్‌రెడ్డి, నవీన్‌నాయక్, సైదులు, సక్రునాయక్, ఎల్లారెడ్డి, కరీం, అప్పరావు, భీముడునాయక్, మాలోతు నాగునాయక్, కోట్యానాయక్, కొండానాయక్, భక్యానాయక్, మాలోతు బాలునాయక్, కె.మోహన్ నాయక్, ఆర్.వశ్యానాయక్, చెన్నానాయక్, లచ్చీరాం పాల్గొన్నారు.



నడిగూడెం మండలంల వల్లాపురంలో మహిళలతో ఎమ్మెల్యే పద్మావతి

● పార్లమెంట్ ఎన్నికల్లో లౌకికవాద పార్టీలను గెలిపించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మేకల శ్రీనివాసరావు కోరారు. సీపీఐ బలపర్చిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ కోదాడలోని 26, 27, 28, 30వ వార్డుల్లో ఇంటింటి ప్రచారం చేశారు. ప్రచారంలో షేక్ లతీఫ్, కౌన్సిలర్ షాబుద్దీన్, కాంగ్రెస్ నాయకులు భాయిజాన్, ఖాసిం, రషీద్, శ్రీను, సీపీఐ నాయకులు పార్వతి, మోషిన్, పాల్గొన్నారు.

● కాంగ్రెస్ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ మేళ్లచెర్వు మండలం కేంద్రంలో ఆ పార్టీ కార్యకర్తలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో ఎంపీటీసీ బండారుపల్లి రామకృష్ణ, ఇరిగెల రామకృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బుస్స రామయ్య, మంద రవి పాల్గొన్నారు.

● కాంగ్రెస్ అభ్యర్థి రఘువీర్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు చావా సహదేవరావు హుజూర్‌నగర్‌లోని ఎన్నెస్పీ క్యాంపు, శ్రీనగర్‌కాలనీ ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ముశం సత్యనారాయణ, బొడ్డు గోవిందరావు, ఫణిందర్, విజయ, బుడిగ లక్ష్మి, పద్మ, మాణిక్యం పాల్గొన్నారు.

● భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ మద్దిరాల మండలంలో డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్, నూతనకల్ మండలంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు నాగం సుధాకర్‌రెడ్డి, తుంగతుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్‌రెడ్డి ప్రచారం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అవిలమల్లు, మార్త అనితకృష్ణమూర్తి, పచ్చిపాల వెంకన్న, నలమాస ఉపేందర్, వాసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, బొడ్డుపల్లి అంజయ్య, మహేశ్వరం చంద్రకళ, ఎంపీటీసీ పన్నాల రమ పాల్గొన్నారు.

● నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ మోతె మండలంలోని నామవరం, రాఘవాపురం, మోతెలో ఎంపీపీ ముప్పాని ఆశ ప్రచారం చేశారు. ప్రచారంలో జడ్పీటీసీ పందిళ్లపల్లి పుల్లారావు, కీసర సంతోష్‌రెడ్డి, సామ వెంకట్‌రెడ్డి, నూకల మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు సుతారి మేస్త్రి మృతి

తిరుమలగిరి, మే 8: ప్రమాదవశాత్తు సుతారి మేస్త్రీ మృతి చెందాడు. ప్రత్యక్ష సాక్షులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మునిసిపాలిటీ కేంద్రానికి చెందిన పాలబిందెల సత్తయ్య(45)సుతారి మేస్త్రిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మంగళవారం సాయంత్రం ఓ ఇంటిపై రేకులు వేస్తుండగా, ఒక్కసారిగా వీచిన ఈదురుగాలులతో కిందపడ్డాడు. సత్తయ్యపై ఇటుకలు పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. సత్తయ్యను కుటుంబ సభ్యులు, తిరుమలగిరిలో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లో ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. సత్తయ్యకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.



సత్తయ్య (ఫైల్ ఫొటో)

వడదెబ్బతో మహిళ మృతి

మఠంపల్లి, మే 8: వడదెబ్బతో మహిళ మృతి చెందింది. మృతురాలి బంధువులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా రామాలయ కాలనీకి చెందిన అబ్బగాని ప్రమీల(53 మూడు రోజుల క్రితం వడదెబ్బకు గురైంది. కుటుంబ సభ్యులు ఆమెకు ఇంట్లోనే వైద్యం అందించి, అనంతరం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. ప్రమీలకు భర్త, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.



ప్రమీల (ఫైల్ ఫొటో)

విద్యుదాఘాతంతో పాడి గేదెలు మృతి

నాగారం, మే 8: విద్యుదాఘాతంతో మూడు పాడి గేదెలు మృతి చెందాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగారం మండల కేంద్రానికి చెందిన ఆకారపు కృష్ణయ్య, ఆకారపు చంద్రయ్య, చిప్పలపల్లి ఉపేందర్‌కు పాడి గేదెలు మంగళవారం రాత్రి మేత కోసం వెళ్లగా, అదే సమయంలో ఈదురు గాలులు, వర్షానికి విద్యుత్ వైర్లు తెగి పడ్డాయి. ఈ తీగలు గేదెలకు తగిలి మూడు గేదెలు విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతిచెందాయి. రూ.1.80లక్షల విలువైన మూడు గేదెలు మృతి చెందాయని, తమను ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని రైతులు కోరారు. విద్యుత్ లైన్‌మన్ సాంబయ్య ఘటనా స్థలాన్ని పరిశీలించారు. వైద్యాధికారి బత్తుల రవి పోస్టుమార్టం నిర్వహించారు.

'రేషన్ డీలరును తొలగించాలి'

నూతన్‌కల్, మే 8: లబ్ధిదారులతో అసభ్యంగా మాట్లాడుతున్న సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలంలోని ఎడవెల్లి గ్రామ రేషన్ డీలరును తొలగించాలని ఆ గ్రామస్థులు కోరారు. బుధవారం గ్రామంలో రేషన్ దుకాణం ఎదుట ఆందోళన చేసి దుకాణానికి తాళం వేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ లబ్ధిదారులతో రేషన్ డీలర్ అసభ్యంగా మాట్లాడటంతో పాటు బియ్యాన్ని సక్రమంగా పంపిణీ చేయడంలేదన్నారు. ఉండాల్సిన స్టాక్‌కు మించి అధికంగా ఉన్నందున అధికారులు ఆయనను గతంలో సస్పెండ్ చేసినా, తీరు మారలేదన్నారు. వయసు పైబడినందున ఆయనను తొలగించి మరొకరికి అవకాశం ఇవ్వాలని అధికారులను ఆ గ్రామస్థులు కోరారు.

'షెడ్డు కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలి'

తుంగతుర్తి, మే 8: మండల కేంద్రంలోని దవాఖానా ఎదురుగా ఉన్న బావి ప్రాంగణంలో ఉన్న షెడ్డును కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ డివిజన్ కార్యదర్శి ఎర్ర అఖిల్ కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం తుంగతుర్తిలోని దుబ్బాక సంజీవరెడ్డి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆ బావి పక్కన వివాదాస్పద స్థలం ఉందన్నారు. ఈ భూమిలో ఇంటి నిర్మాణానికి గ్రామ కార్యదర్శి అక్రమంగా అనుమతి ఇచ్చారన్నారు. దీంతో దవాఖానా బావి షెడ్డును రాత్రికి రాత్రే ఎక్స్‌కవేటర్‌తో కూల్చేశారని తెలిపారు. దీనిపై కలెక్టర్ స్పందించి పూర్తి స్థాయిలో విచారణ చేయించాలని కోరారు. సమావేశంలో అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పేర్ల నాగయ్య, జిల్లా నాయకులు వేర్పుల లక్ష్మయ్య, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య జిల్లా కన్వీనర్ గొడ్డలి నర్సయ్య, భవన నిర్మాణ కార్మిక సంఘం కన్వీనర్ కరుణాకర్, పీవోడబ్ల్యూ నాయకుడు బయ్యక్క తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానంతో అంధుల జీవితాల్లో వెలుగులు

కోదాడ టౌన్, మే 8: నేత్రదానంతో అంధుల జీవితాల్లో వెలుగులు నింపవచ్చని కోదాడ స్వర్ణభారతి చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు గాదంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. కోదాడలోని శ్రీనివాసనగర్‌కు చెందిన పోలిశెట్టి స్వరాజ్యం అనారోగ్యంతో మంగళవారం రాత్రి మృతి చెందింది. ఆమె నేత్రాలను స్వర్ణభారతి చారిటబుల్ ట్రస్టు సభ్యులు సేకరించారు. ఈ సందర్భంగా ఆ ట్రస్టు అధ్యక్షుడు గాదంశెట్టి శ్రీనివారావు మాట్లాడుతూ నేత్రదానంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రముమంలో నేత్రదానం ఇన్‌చార్జి పైడిమర్రి సుధాకర్, జాయింట్ సెక్రటరీ యాద సుధాకర్, రవికుమార్, స్వరాజ్యం కుటుంబ సభ్యులు పోలిశెట్టి బ్రహ్మం, నవీన్, పురుషోత్తం, శ్రీనివాసరావు, విశ్వనాథం, రమేష్, ప్రకాశం, కుక్కడపు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం

తిరుమలగిరి, నూతనకల్, మే 8: తిరుమలగిరి మునిసిపాలిటీ పరిధిలోని మాలిపురం గ్రామానికి చెందిన పోతరాజు ఎల్లమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. ఆమె కుటుంబ సభ్యులను ఏపూరి ఫౌండేషన్ అధ్యక్షుడు ఏపూరి సోమన్న బుధవారం పరామర్శించి, రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు.

●నూతన్‌కల్ మండలంలోని వెంకేపల్లి గ్రామానికి చెందిన పాల్వాయి నిర్మల ఇటీవల మృతి చెందగా, ఆమె కుటుంబ సభ్యులను కాంగ్రెస్ పార్టీ నాయకులు పరామర్శించి, ఎమ్మెల్యే మందుల సామేలు పంపించిన రూ.10వేలను సైరెడ్డి సుధీర్‌రెడ్డి, ఎలిమినేటి కృష్ణప్రశాంత్ అందజేశారు.కార్యక్రమంలో పాల్వాయి నాగరాజు, తొన్కునూరి సైదులు, చంద్రారెడ్డి, రవిరెడ్డి, విజయ్‌రెడ్డి, సోమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాపీ మేస్త్రి కుటుంబాన్ని ఆదుకోవాలి

ఆత్మకూర్(ఎస్), మే 8: మండలంలోని బొప్పారం గ్రామానికి చెందిన తాపీ మేస్త్రి ఇందూరి వెంకన్న కుటుంబాన్ని కార్మికశాఖ ఆదుకోవాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు గంట నాగయ్య అన్నారు. బుధవారం బొప్పారం గ్రామంలో వెంకన్న మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. ఇటీవల గుండెపోటు, వడదెబ్బ, అనారోగ్యంలో అనేక మంది భవన నిర్మాణ కార్మికులు మృతి చెందారన్నారు. ఆయా కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు గడ్డం ఉపేందర్, చంటి, సతీష్, ముత్యాలు, వెంకన్న, ఉమేష్, సుధాకర్‌రెడ్డి, మధు పాల్గొన్నారు.

'నేటి సెమినార్‌ను విజయవంతం చేయాలి'

సూర్యాపేట అర్బన్, మే 8: జిల్లా కేంద్రంలోని ఆర్‌ఆర్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో గురువారం నిర్వహించే 'ప్రమాదంలో భారత ప్రజాస్వామం' అనే అంశంపై నిర్వహించే సెమినార్‌ను విజయవంతం చేయాలని పౌర ప్రజాస్వామిక వేదిక సమన్వయకర్త కె.చంద్రకాంత్ కోరారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఈ వేదిక కార్యాలయం ఆవరణలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ప్రస్తుత జాతీయ ఆర్థిక పరిస్థితిని, రాజకీయాలను అర్థం చేసుకుని ముందుకుసాగాలన్నారు. పదేళ్ల మోదీ పాలనలో దేశ ఆర్థిక పరిస్థితి దిగజారిందన్నారు. ఎలక్ట్రోరల్ బాండ్ల పేరిట అవినీతిని చట్టబద్ధం చేశారన్నారు. సమావేశంలో వీరేష్, బొడ్డు శంకర్, గోపి, పాల్గొన్నారు.

మామిడి కాయలు నేలపాలు

మద్దిరాల, తిరుమలగిరి రూరల్, మే 8: జిల్లాలో మంగళవారం రాత్రి వచ్చిన గాలి దూమారానికి మద్దిరాల, తిరుమలగిరి మండలాల్లో మామిడి కాయులు రాలి నేలపాలయ్యాయి. పలు తోటల్లో మామిడి చెట్ల విరిగిపోయాయి. తిరుమలగిరి మండలంలో జేత్యానాయక్‌తండాలో బానోత్ కిష్టునాయక్‌కు చెందిన ఏడెకరాల మామిడి తోటలో మామిడి కాయలు రాలడంతో సుమారు రూ.70వేలు నష్టం జరిగిందని బాధిత రైతు తెలిపాడు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని రైతు కోరాడు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

అనంతగిరి, మే 8: మండలంలోని తమ్మర గ్రామం వద్ద ఇసుక ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ నవీన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం..గోండ్రియాలలోని పాలేరు వాగు నుంచి కోదాడకు ఇసుకను అక్రమంగా తరలిస్తున్నా ట్రాక్టర్‌ను పట్టుకుని సీజ్ చేశామన్నారు. ట్రాక్టర్ డ్రైవర్ వెంకటేశ్వరరావుపై కేసు నమోదు చేశామన్నారు.

బూరుగడ్డ దేవాలయంలో ప్రత్యేక పూజలు

హుజూర్‌నగర్, మే 8: మండలంలోని బూరుగడ్డ వేణుగోపాలస్వామి దేవాలయంలో స్వామివారి కల్యాణ బ్రహ్మోత్సవాలలో భాగంగా 16రోజుల పండుగ సందర్భంగా బుధవారం ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో హరీష్‌కుమార్, నరిసింహారావు, గురవయ్య, భిక్షం, గంగయ్య పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయం

నడిగూడెం, మే 8: చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే పద్మావతి అన్నారు. బుధవారం నడిగూడెంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే పారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గుండు శ్రీను, సుధీర్, దున్నా శ్రీను, జడ్పీటీసీ బానాల కవిత, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

సూర్యాపేట టౌన్, తిరుమలగిరి మే 8: రాష్ట్రంలో కురిసిన అకాల వర్షాలు, ఈదురు గాలులతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని విక్రమ్ భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐకేపీ కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని సకాలంలో కాంటాలు వేయాలన్నారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.30వేలు అందజేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కారింగుల వెంకన్న, కొత్తపల్లి రేణుక, ఎర్ర అఖిల్‌కుమార్ పాల్గొన్నారు.

●ఈదురు గాలులు, అకాల వర్షాలతో నష్టపోయిన పండ్ల తోటల రైతులను, ఇళ్లు దెబ్బతిన్న ప్రజలను ప్రభుత్వం ఆదుకోవాలని తిరుమలగిరి మండలంలోని తొండ గ్రామానికి చెందిన గ్రామాభ్యుదయ కమిటీ సభ్యులు కోరారు. ఈ మేరకు తహసీల్దార్ సుధకు బుధవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వేల్పుల ప్రవీణ్, కృష్ణయ్య, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

వేములూరి ప్రాజెక్టు భూములను కాపాడాలి

హుజూర్‌నగర్, మే 8: మండలంలోని వేమూలూరి ప్రాజెక్టు భూములను కాపాడాలని ప్రాజెక్టు కింది రైతులు, మత్స్యకారులు పోకల వెంకటేశ్వర్లు, ఈద నాగేశ్వరరావు, జొన్నలగడ్డ తిరపయ్య కోరారు. ఈమేరకు బుధవారం పట్టణంల ఆర్డీవోకు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కోట్లాది రూపాయలు విలువ చేసే ప్రాజెక్టు శిఖం భూములను కొంతమంది అక్రమార్కులు కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. జలాశయంలో నీరు లేనందున, చెరువు మట్టిని చదును చేసి భూములుగా మారుస్తున్నారని ఆరోపించారు. అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సతీష్, నాగుల్‌మీరా పాల్గొన్నారు.

'ప్రశ్నించే గొంతుకను పార్లమెంట్‌కు పంపాలి'

మద్దిరాల, మే 8: ప్రజా సమస్యలపై ప్రశ్నించే గొంతుక, భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ సీపీఎం అభ్యర్థి జహంగీర్‌ను గెలిపించాలి సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి కోరారు. బుధవారం మద్దిరాల మండలంలోని గోరెంట్ల, చౌళ్లతండ గ్రామాల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో కోట గోపి, మధు, దీకొండ ఉపేందర్, పోలోజు సైదులు, పాల్గొన్నారు.

'కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసిన బీజేపీ ప్రభుత్వం'

హుజూర్‌నగర్, మే 8: కార్మిక చట్టాలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కంబాల శ్రీనివాస్‌నాయుడు ఆరోపించారు. బుధవారం మండలంలోని వేపలసింగారంలో ఏర్పాటు చేసిన పార్టీ సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో ధన్‌రాజ్‌రెడ్డి, ఆనంద్ పాల్గొన్నారు.

సాధ్యంకాని హామీలతో మోసం చేసిన కాంగ్రెస్



ఆత్మకూర్(ఎస్)లో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి

ఆత్మకూర్(ఎస్), మఠంపల్లి, చివ్వెంల, సూర్యాపేట అర్బన్, మోతె, హుజూర్‌నగర్, మద్దిరాల, మే 8: సాధ్యంకాని హామీలతో ప్రజలను కాంగ్రెస్ మోసం చేసిందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డిని గెలిపించాలని కోరుతూ బుధవారం ఆత్మకూర్(ఎస్) మండల కేంద్రంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు నెలల కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో వెనుకబడిందన్నారు. ప్రచారంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తూడి నర్సింహారావు, కొణతం సత్యనారాయణరెడ్డి, మర్ల చంద్రారెడ్డి, నేరెళ్ల వెంకన్న, కృష్ణారెడ్డి, యాదగిరి పాల్గొన్నారు.

● అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలుచేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని జడ్పీటీసీ బానోతు జగన్ నాయక్, బీఆర్ఎస్ పార్టీ మఠంపల్లి మండల అధ్యక్షుడు ఇరుగు పిచ్చయ్య అన్నారు. నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డిని గెలిపించాలని కోరుతూ బుధవారం మఠంపల్లితో పాటు మండల వ్యాప్తంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

● బీఆర్ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డిని గెలిపించాలని జడ్పీటీసీ భూక్యా సంజీవనాయక్ కోరారు. చివ్వెంల మండలంలోని గాయంవారిగూడెం, బంగారుతండాలో ఆయన ప్రచారం చేశారు. జిల్లా కేంద్రంలోని 17వ వార్డుతో పాటు పలు వార్డుల్లో బీఆర్ఎస్ నాయకుడు నిమ్మల శ్రీనివాస్‌గౌడ్ మోతె మండలంలోని పలు గ్రామాల్లో కోదాడ ఎన్నికల కన్వీనర్ కటికం సత్తయ్యగౌడ్ ప్రచారం చేశారు.

● హుజూర్‌నగర్ పట్టణంలోని ఇందిరా సెంటరులో గురువారం నిర్వహించనున్న రోడ్డు షో, కార్నర్ మీటింగ్‌ను విజయవంతం చేయాలని పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఒంటెద్దు నరసింహారెడ్డి అన్నారు. పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమాలకు ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి కృష్ణారెడ్డి హాజరవుతున్నట్లు తెలిపారు.

● భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేష్‌ను గెలిపించాలని ఆ పార్టీ మద్దిరాల మండల అధ్యక్షుడు ఎస్‌ఏ రజాక్ కోరారు. మండలంలోని మామిళ్లమడవ, కుక్కడం, తూర్పుతండ గ్రామాల్లో నిర్వహించిన ప్రచారంలో ఆయన మాట్లాడారు.

అవినీతిరహిత పాలన బీజేపీతోనే సాధ్యం

మేళ్లచెర్వు, మఠంపల్లి, మోతె, సూర్యాపేట రూరల్ మే 8: అవినీతిరహిత పాలన బీజేపీ ప్రభుత్వంతోనే సాధ్యమని నల్గొండ పార్లమెంట్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి అన్నారు. బుధవారం మేళ్లచెర్వులో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొబ్బ భాగ్యరెడ్డి, చల్లా శ్రీలతరెడ్డి, తుమ్మల శ్రీను, రామారావు, వీరబాబు, తప్ప అనిల్ తదితరులు పాల్గొన్నారు.

● అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలను అందిస్తూ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్న బీజేపీ మూడో సారి అధికారంలోకి వస్తుందని శానంపూడి సైదిరెడ్డి అన్నారు. మఠంపల్లిలో నిర్వహించిన ర్యాలీలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎల్లయ్య, బాలునాయక్, నరినాయక్, రంగానాయక్, గుర్రంమట్టారెడ్డి, శేషిరెడ్డి పాల్గొన్నారు.

●వారసత్వ రాజకీయం పోవాలంటే శానంపూడి సైదిరెడ్డిని గెలించాలని రాష్ట్ర గిరిజన సంఘం అధ్యక్షుడు అశోక్ రాథోడ్ కోరారు. మోతె మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో ఎస్సీ నాయక్, వంగవీటి శ్రీనివాస్‌రావు, బి.శ్రీనివాస్‌నాయక్, కొత్త ధర్మారెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

● గ్రామాలు కేంద్ర ప్రభుత్వ నిధులతోనే అభివృద్ధి చెందాయని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్‌రావు అన్నారు. సూర్యాపేట మండలం యండ్లపల్లి, రామారం గ్రామాల్లో ఆయన ప్రచారం చేశారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఈ నెల 10న నిర్వహించే రోడ్‌షోలో బీజేపీ తమిళనాడు రాష్ట్ర అధ్యక్షుడె అన్నామలై పాల్గొంటారని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెన్న శశిదర్‌రెడ్డి, నాయకులు వెన్న చంద్రారెడ్డి, కర్నాటి కిషన్, పల్స మల్సూర్‌గౌడ్, సలికంటి వీరెంద్ర, ఎండీ అబీబ్ ఉప్పు శ్రీనివాస్ పాల్గొన్నారు.



మేళ్లచెర్వులో రోడ్‌షో నిర్వహిస్తున్న శానంపూడి సైదిరెడ్డి

పోలీసు పహారాలో యల్లయ్య అంత్యక్రియలు

సూర్యాపేట రూరల్, మే 8: జిల్లాలో సంచలనం సృష్టించినవడ్డే యల్లయ్య మృతదేహం లభ్యమైంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం జగ్గయ్యపేట మండలం బండిపాలెం గ్రామ శివారులో మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. 20రోజుల క్రితం యల్లయ్య అదృశ్యం కేసులో మృతదేహం లభ్యంకావడంతో మిస్టరీ వీడింది. రూరల్ ఎస్ఐ బాలునాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఎల్లయ్యకు, నాగారం మండలం మాచిరెడ్డిపల్లికి చెందిన శ్రీకాంతాచారికి మధ్య రియల్‌ఎస్టేట్ భూవివాదాలున్నాయి. ఈ క్రమంలో ఎల్లయ్యను హతమార్చేందుకు శ్రీకాంతాచారి ప్రణాళిక ప్రకారం హతమార్చాడు. యల్లయ్య మృతదేహం పోలీసుల బందోబస్తు నడుమ గ్రామానికి బుధవారం సాయంత్రం చేరుకుంది. యర్కారం గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. యల్లయ్య అంత్యక్రియలకు సూర్యాపేట జిల్లాలోని మావోయిస్టు మాజీ నేతలు హజరుకావడంతో పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించారు. బందోబస్తులో సూర్యాపేట అదనపు ఎస్పీ నాగేశ్వర్‌రావు, సూర్యాపేట డీఎస్పీ రవి, సీఐ సురేందర్‌రెడ్డి, ఎస్ఐ బాలునాయక్‌తో పాటు మరో నలుగురు సీఐలు, 10మంది ఎస్ఐలు, పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. అంత్యక్రియలు ప్రశాంతంగా ముగిసేవరకు గ్రామంలో ఉండి ప్రత్యేక నిఘా పెట్టారు. యల్లయ్య మృతదేహానికి మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, తెలంగాణ పర్యాటక శాఖ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, కొప్పుల వేణారెడ్డి, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై నివాళులర్పించారు.



ఎల్లయ్య మృతదేహాన్ని పరిశీలిస్తున్న దామోదర్‌రెడ్డి, యల్లయ్య ఫైల్ ఫొటో(ఇన్‌సెట్లో)

మిన్నంటిన కుటుంబ సభ్యుల రోదనలు..

20 రోజుల క్రితం కిడ్నాప్ అయిన తన భర్త ఎలాగైనా తెలివితో వస్తాడని ఆశతో ఉన్న కుటుంబ సభ్యులకు ఎల్లయ్య మృతదేహం లభ్యం కావడంతో వారి ఆశలు అడియాసలయ్యాయి. ఎప్పటికైనా తిరిగి వస్తాడని, మా నాన్న ఎంతమందినైనా ఎదిరించి బయటపడతాడని అనుకున్నా ఇలా విగత జీవి అవుతాడని అనుకోలేదని ఎల్లయ్య ఇద్దరు కుమార్తెలు బోరున విలపించారు. నిన్నటి వరకు ఏదో ఆశతో ఉన్న కుటుంబ సభ్యులు మృతదేహం దొరకడంతో వారి రోదనలు మిన్నంటాయి. పెద్ద కుమార్తె తలకొరివి పెట్టి అంత్యక్రియలు పూర్తి చేశారు. ఎల్లయ్య మృతదేహం అంబులెన్స్‌లో గ్రామానికి రావడంతో గ్రామస్థులు, ఆయన అభిమానులు భారీ సంఖ్యలో అంబులెన్స్ వద్దకు చేరి తిరిగి బోరున విలపించారు.